
Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 29.03.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 43 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## ఈ రణం.. ఇద్దరికీ
# జీవన్మరణం



- జయించిన వాళ్ళే జనంలో వుంటారు
- ఓడిన వాళ్ళకు రాజకీయ సన్యాసమే
- కొడుకు కోసం బాబు ఆరాటం
- నాన్న ఆశయ సాధనకే జగన్ పోరాటం

నవ్యాంధ్రలో తుదిపోరుకు సర్వశక్తులు ఒడ్డుతున్న చంద్రబాబు, వై.యస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర రాజకీయాలలో ఎప్పుడూ లేని ఉద్రిక్త పరిస్థితులు రోజు రోజుకీ వేడెక్కుతున్న రాష్ట్రం


10లో



## 'ఖాకీ' వనంలో...
# పసుపు మొక్కలు

- ఏరేసిన ఎన్నికల కమిషన్

(వివరాలు 10వ పేజీలో)




## చూపంతా...
# ఉత్తరం వైపే!

- ఆ ఐదు జిల్లాల ఫలితాలే కీలకం
- 'కాపు' కాసేదెవరికో...?

రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. పోలింగ్ తేదీ దగ్గర పడే కొద్ది జనంలో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంటుంది. అధికారమే లక్ష్యంగా అటు తెలుగుదేశం, ఇటు వైయస్సార్ (మిగతా 3వ పేజీలో)



ప్రగతిని చూడండి...
మంచిని గెలిపించండి







నవ్యాంధ్ర రథసారధి గౌరవ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆశీస్సులతో
నెల్లూరు పార్లమెంట్ మరియు నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కోవూరు,
ఆత్మకూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాల నుండి
తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా మీ ముందుకొస్తూ... మీ ఆశీస్సులు కోరుతున్నాం.
మీ అమూల్యమైన ఓటుతో ఆశీర్వదించండి... గెలిపించండి.
నెల్లూరుజిల్లా అభివృద్ధికి చేయూతనివ్వండి!

సైకిల్‌కు ఓటు... ప్రగతికి చోటు

జై తెలుగుదేశం
సైకిల్ గుర్తుకే మన ఓటు

పోలింగ్ తేది:
11.04.2019 గురువారం

బీద మస్తాన్‌రావు
నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి

ఈసారి ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాలు ప్రత్యేకతని సంతరించుకున్నాయి. వాటిలో మంగళగిరి మొదటిదైతే, నెల్లూరు నగరం రెండవది. వీటి ప్రత్యేకత ఏంటంటే ఈ రెండు చోట్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులుగా సామాన్యకుటుంబీకులు పోటీ చేస్తుండడమే! అలాగే రెండు చోట్లా కూడా తెలుగుదేశం అభ్యర్థులుగా అపర కుబేరులు లోకేష్, నారాయణలు పోటీ చేస్తున్నారు.



## రాష్ట్రంలోనే...
# ఆసక్తిగా మారిన నెల్లూరు నగరం

○ కాసుల నిధి.. నారాయణ

○ సామాన్యుల పెన్నిధి.. అనిల్

నారాయణ, లోకేష్... ఇద్దరూ మంత్రులే, ఒకప్పటి గురుశిష్యులు కూడా! నెల్లూరు వైసిపి అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ వై.యస్.జగన్ వీరాభిమాని. ఆయన పట్ల తన భక్తిని, విశ్వాసాన్ని ప్రతి సందర్భంలో చూపించుకుంటూ వచ్చాడు. కాబట్టే రాష్ట్ర వ్యాప్తంగా జగన్ అభిమానులు నెల్లూరు నగరం నుండి అనిల్ గెలవాలని ఆసక్తిగా చూస్తున్నారు.

ఎప్పుడూ 'రెడ్ల' ఆధిపత్యం కనిపించే నెల్లూరు నగరం నియోజకవర్గం నుండి వైసిపి అభ్యర్థిగా యాదవ సామాజిక వర్గానికి చెందిన అనిల్ బరిలో దిగితే తెలుగుదేశం అభ్యర్థిగా కాపు సామాజిక వర్గానికి చెందిన నారాయణ విద్యాసంస్థల అధినేత, మంత్రి పి.నారాయణ ఉన్నాడు. ప్రజాజీవనంలో వీరిద్దరివీ భిన్నమైన దారులు. అనిల్‌ది స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి స్కూల్. రాజకీయ ఓనమాలు దిద్దింది అక్కడే. ప్రజలతో ఎలా మెలగాలి, ప్రజలతో ఎలా కలవాలి, ప్రజా సమస్యలపై ఎలా పోరాడాలి అన్నది నేర్చుకున్నది అక్కడే! 2008లో సాధారణ కార్పొరేటర్‌గా రాజకీయాలలోకి అడుగుపెట్టిన అనిల్ ఏడాదిలోపే వై.యస్. ఆశీస్సులతో 2009 ఎన్నికల్లో నెల్లూరు నగరం నుండి కాంగ్రెస్ అభ్యర్థి అయ్యాడు. తనకున్న చాలా తక్కువ రాజకీయ అనుభవంతోనే ఆ ఎన్నికల్లో పోరాడాడు. సొంత పార్టీ నేతల వెన్నుపోటు కారణంగా ఆ ఎన్నికల్లో కేవలం 90ఓట్ల తేడాతో ప్రజారాజ్యం అభ్యర్థి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి చేతిలో ఓడిపోయాడు. ఓడిపోయాను కదా... నాకు ఈ రాజకీయాలు ఎందుకులే అని అనిల్ అనుకుని వుంటే అతని రాజకీయ చరిత్ర అక్కడితో ఆగిపోయేదేమో! కాని, ఆ తర్వాత జరిగిన పరిణామాలు అనిల్ రాజకీయ జీవితాన్ని వూహించని మలుపు తిప్పాయి. ఎన్నికల తర్వాత ఆనంతో విభేదించడం, 2012లో వైయస్ జగన్ వైసిపిని స్థాపించాక ఆ పార్టీలో చేరడం, నెల్లూరు నగర బాధ్యతలు తీసుకోవడం, అనునిత్యం ప్రజల మధ్య వుండడం... 2014 ఎన్నికల్లో అనిల్‌కు ఇవే తిరుగులేని విజయాన్ని కట్టబెట్టాయి. 2014 ఎన్నికల తర్వాత ప్రతిపక్ష ఎమ్మెల్యే అయినప్పటికీ ప్రజాసమస్యల పోరాటంలో ఎక్కడా వెనక్కి తగ్గలేదు. నగరంలో పలు అంశాలపై పోరాటాలు చేశాడు. పేదలకు అండగా నిలిచాడు. ఈ ఐదేళ్లలో సామాన్యులకు బాగా చేరువయ్యాడు. ఈ ఎన్నికల్లోనూ వైసిపి అభ్యర్థిగా ప్రజల ముందుకు వెళ్లాడు.

ఇటు చూస్తే... టిడిపి అభ్యర్థి పి.నారాయణ. ధనబలంలో కొండలాంటోడు. రాజకీయ అనుభవం తక్కువ. ఐదేళ్లుగా చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా వున్నాడు. గత రెండేళ్లలో నెల్లూరుకు నిధులు బాగానే తెచ్చాడు. పార్క్‌లు, సిమెంట్‌రోడ్లు వంటివి వేయించాడు. అయితే తవ్వినరోడ్లు ఆయనకు మంచి చేస్తాయో, ముంచేస్తాయో చూడాలి. నారాయణకు ప్రజలతో నేరుగా సంబంధాలు లేవు. క్రింది స్థాయి నాయకుల మీద ఆధారపడాలి. ఆయనకు ఇవి తొలి ఎన్నికలు. వాస్తవంగా అయితే పదవుల కోసం ఆయన ఎన్నికల్లో పోటీ చేయాల్సిన అవసరం లేదు. కాకపోతే అనిల్ మీద ఇంకెవరు పోటీ చేసినా గెలవలేరని, నారాయణ అయితేనే గట్టిపోటీ వుంటుందని పార్టీ నాయకత్వం భావించిన నేపథ్యంలో ఆయనను బరిలోకి దింపారు. నెల్లూరు నగరంలో 1994 తర్వాత తెలుగుదేశం పార్టీకి గెలుపన్నది లేదు. మరి ఈసారన్నా గెలుస్తుందో... లేక నారాయణకు కూడా సొంత పార్టీ నేతల వెన్నుపోటు తగిలి ఆ సాంప్రదాయం కొనసాగుతుందో వేచి చూడాలి!

## వైసిపి జాయింట్ సెక్రటరీగా
# వై.వి.రామిరెడ్డి

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నెల్లూరుకు చెం దిన వై.వి.రామి రెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశంకు చెందిన వై.వి.రామిరెడ్డి ఇటీవలే వైసిపిలో చేరాడు. నెల్లూరు పార్లమెంట్, అలాగే నెల్లూరు సిటి, రూరల్ నియోజక వర్గాలలో పార్టీ గెలుపు కోసం పని చేస్తున్నాడు.

# నిర్లక్ష్య ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నిర్లక్ష్యం చేసి మూడుసార్లు అవకాశం ఇచ్చినా, దుమ్మా కొట్టిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు ఈనెల 25 న నోటీసులు జారీ చేసారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 11 న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి 7472 మంది ప్రభుత్వ ఉద్యోగ, సిబ్బందిని సిద్ధం చేసారు. వారికి మొదట విడతగా నియోజకవర్గాల వారీగా రెండుసార్లు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు జిల్లా వ్యాప్తంగా 7090 మంది హాజరయ్యారు. హాజరుకాని వారికి మరోసారి నెల్లూరులోని డికెడబ్ల్యూ కళాశాలలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు జిల్లా వ్యాప్తంగా 59 మంది దుమ్మా కొట్టారు. దీంతో జిల్లా కలెక్టర్ వారందరికి షోకాజ్ నోటీసులు జారీ చేసారు.

# భలే గిరాకీ

వివిధ పార్టీల అభ్యర్థుల నామినేషన్ ర్యాలీల పుణ్యమా అని కూలీలకు భలే గిరాకీ ఏర్పడింది. నామినేషన్ ర్యాలీలకు జన సమీకరణ కోసం అన్ని పార్టీల అభ్యర్థులు కూడా భారీగానే ఖర్చుపెట్టారు.

ఒక్కొక్కరికి 500 రూపాయల డబ్బులు, మద్యం, బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. రోజులాగే కూలీలకు వెళ్ళే వాళ్ళు గత వారంరోజుల్లో నామినేషన్ ర్యాలీలకు బాగానే వెళ్లారు. ఇళ్ళల్లో పనులు చేసుకునేవాళ్ళు కూడా ర్యాలీలకు పోయారు. ఇది సీజన్ అని, నాలుగు రూపాయలు సంపాదించుకునే కాలమని వాళ్ళు ఏ పార్టీ వాళ్ళు పిలిచినా కాదనకుండా పోతున్నారు.






## వలసలు పోటెత్తినా...
# పార్టీలకు ఓటెత్తేనా?


ఒకరా... ఇద్దరా... ముగ్గురా... 2019 ఎన్నికల్లో రాజకీయ వలసలు వరద ప్రవాహాన్ని తలపించాయి. ఒక ఉ ధృతిలో సాగాయి. పోటెత్తిన ఈ వలసలతో ఏ పార్టీకి లాభం... ఎవరికి ఓట్లు రూపంలో మారనున్నాయి?



జిల్లా వరకు రాజకీయ వలసలు అధికార తెలుగుదేశం పార్టీ నుండి వైసిపిలోకే ఎక్కువగా జరిగాయని చెప్పవచ్చు. వైసిపి నుండి తెలుగుదేశంలోకి పెద్ద జాయినింగ్‌గా జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కావలి మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, పనబాక లక్ష్మిలని చెప్పుకోవచ్చు. విష్ణు వల్ల టిడిపికి ఉపయోగమేంటంటే కావలిలో ఆ పార్టీకి అభ్యర్థిగా దొరికాడు. ఇక బొమ్మిరెడ్డి రాఘవను ఆత్మకూరులో పార్టీ గెలుపు కోసం వాడుకోవాలని చూస్తుంది. మరి ఎంత వరకు ఉపయోగపడతాడో చూడాలి!?

కాని, టీడీపీలో నుండి వైసిపిలోకి సాగిన వలసలు మాత్రం జిల్లాలో వైసిపిని బలోపేతం చేశాయి. ఒక్కో నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేశాయి. ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పొణకా దేవసేన, వెంకటగిరి రాజాలు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, వై.వి.రామిరెడ్డి, ఇటీవలకాలంలో పార్టీలో చేరిన ఈ నాయకుల మూలంగా జిల్లాలో వైసిపి ఇంకా ఎంతో బలం పుంజుకుందనుకోవచ్చు. అయితే ఆ బలం ఎంతన్నది రేపు ఓట్ల రూపంలో వెల్లడి కావాల్సివుంది.

## రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి
# గణేశం కృష్ణారెడ్డి కోటిరూపాయలిచ్చాడు


కలెక్టర్ ముత్యాలరాజుకు విరాళాన్నందజేస్తున్న గణేశం కృష్ణారెడ్డి, కల్పనమ్మ

నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి కోటిరూపాయల విరాళాన్ని అందించి సేవా తత్వంతో పాటు తనలో వున్న దాతృత్వాన్ని కూడా ప్రదర్శించాడు గణేశం కృష్ణారెడ్డి. ఆయన గత కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్ ఆసుపత్రి కార్యవర్గ సభ్యుడిగా కూడా కొనసాగుతున్నాడు. ఆసుపత్రిలో తీసుకునే అనేక కీలక నిర్ణయాలలో ఆయన చురుకైన పాత్ర పోషిస్తుంటాడు. గతంలో పలుమార్లు తనకు చేతనైన సాయం అందించిన కృష్ణారెడ్డి, ఈసారి భారీమొత్తంలో కోటి రూపాయలను జిల్లా కలెక్టర్ ముత్యాలరాజుకు అందజేశాడు. మార్చి 24వ తేదీ ఆదివారం ఆయన తన శ్రీమతి కల్పనమ్మతో కలిసి కలెక్టర్‌కు కోటి రూపాయల చెక్కును అందజేశారు. ఆసుపత్రితో వున్న చిరకాల అనుబంధంతో ఇక్కడ చేసే కార్యక్రమాలను స్వయంగా వీక్షించి పర్యవేక్షిస్తున్న ఆయన అక్కడున్న అవసరాలను గుర్తించి ఈ మొత్తాన్ని అందిస్తున్నట్లు తెలిపాడు. భవిష్యత్‌లో ఆసుపత్రిలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు ఈ మొత్తాన్ని ఉపయోగించుకోవలసిందిగా ఆయన కోరాడు. గణేశం కిష్టయ్యకు 'లాయర్' అభినందనలు.

# పోలింగ్ కేంద్రాల వద్ద సూచిక బోర్డులు

ఓటర్లు ఎటువంటి అవస్థలు పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో అధికారులు అన్ని వసతులతో పాటు నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియజేసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో ఎవరైనా ఫిర్యాదులు చేసేందుకు వీలుగా అధికారులు వివరాలను గోడల మీద రాస్తున్నారు. ఇలా నియోజకవర్గ పరిధిలోని 209 కేంద్రాల వద్ద సంబంధిత అధికారుల వివరాలను తెలియజేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

# ‘మిషన్ శక్తి’ వెనుక నెల్లూరు వ్యక్తి



అంతరిక్ష ప్రయోగాలలో అగ్రరాజ్యాలతో పోటీ పడుతున్న భారత దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో మరో ఘన విజయాన్ని అందుకుంది. అంతరిక్షంలోని శత్రు దేశాల ఉపగ్రహాలను కూల్చి వేయగల శాటిలైట్ విధ్వంసక క్షిపణి(ఏశాట్)ను విజయవంతంగా ప్రయోగించింది. ‘మిషన్ శక్తి’ పేరుతో నిర్వహించిన ఈ ఆపరేషన్‌ను మార్చి 27వ తేదీన ఒడిసాలోని బాలాసోర్‌లో గల డాక్టర్ ఏపిజె అబ్దుల్‌కలాం ద్వీపం నుండి నిర్వహించారు. 27వతేదీ ఉదయం 11.16 గంటలకు ఇక్కడ నుండి క్షిపణిని ప్రయోగించగా కేవలం మూడు నిముషాలలో 300కిలోమీటర్ల దూరంలోని లక్ష్యిత ఉపగ్రహాన్ని కూల్చివేసింది. ఈ ఆపరేషన్ విజయవంతంతో శత్రుదేశ ఉపగ్రహాలను ధ్వంసం చేయగల క్షిపణి సామర్థ్యం గల దేశాలలో అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్ నిలిచింది.



ఈ శత్రుదేశ ఉపగ్రహ విధ్వంసక క్షిపణి ఏ శాట్‌ను రూపకల్పన చేసింది డిఆర్‌డిఏఓ ఆధ్వర్యంలో! ఈ సంస్థ ఛైర్మెన్ గండ్ర సతీష్‌రెడ్డి మన నెల్లూరీయుడు. ఆత్మకూరు మండలం మహిమలూరు వాసి. ఆయన ఆధ్వర్యంలోనే ఈ ప్రయోగం జరగడం, విజయవంతం కావడం అభినందనీయం.

# ఏప్రిల్ 1న విడుదల

## ప్రయోగానికి సిద్ధమైన పిఎస్ఎల్‌వి-సి45



శ్రీహరికోటలో ఉన్న భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ నుంచి పిఎస్ఎల్‌వి–సి45 రాకెట్.. ప్రయోగానికి రెడీ అవుతోంది. వాతావరణ పరిస్థితులన్నీ అనుకూలిస్తే వచ్చేనెల 1వతేది ఉదయం 9–27గంటలకు రాకెట్ ప్రయోగం జరగనుంది. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్–సి 45 వాహకనౌక నింగిలోకి దూసుకువెళ్ళనుంది. ఈ వాహకనౌక డిఆర్‌డిఓకు చెందిన ఎలక్ట్రానిక్ ఇంటలిజెన్స్ శాటిలైట్ ఇమిశాట్‌తో పాటు విదేశాలకు చెందిన 28ఉపగ్రహాలను నింగిలోకి మోసుకు వెళ్ళనుంది. ఆమేరకు అనుసంధానం పూర్తయింది కూడా. అనంతరం అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. ఈనెల 30న రాకెట్ సన్నద్ధత సమావేశం నిర్వహించి, ఆ తర్వాత 31వ తేది ఉదయం 5.27 గంటల నుంచి కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభించ నున్నట్లు సమాచారం.

# అంతర్జాతీయ విద్యా సదస్సులో వాసంతి కిషోర్‌లు




హాంకాంగ్‌లో జరిగిన విద్యాసదస్సులో పాల్గొన్న కృష్ణకిషోర్ దంపతులు

నెల్లూరులో రత్నం విద్యాసంస్థలను స్థాపించి విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్న కెవి రత్నం కుమారుడు డాక్టర్ కృష్ణకిషోర్, ఈయన సతీమణి వాసంతి కృష్ణకిషోర్‌లు హాంకాంగ్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. అంతర్జాతీయ విద్యా విధానాలు, అత్యున్నత ప్రమాణాలు, విశిష్ట బోధనలు, వినూత్న విలువలపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. ప్రపంచంలోని 18దేశాల నుంచి 1800 మంది ప్రముఖ విద్యావేత్తలు, విశ్లేషకులు ఈ సదస్సులో పాల్గొని నూతన విద్యావిధానాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకిషోర్ మాట్లాడుతూ నెల్లూరు సరస్వతి నగర్‌లో వున్న డాక్టర్ కిషోర్స్ రత్నం రేస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐబి విద్యావిధానాలను, అత్యున్నత ప్రమాణాలతో ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విద్యా సంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సిబ్బంది ఈ విషయంపై హర్షం వెలిబుచ్చారు.

# ఇఫ్కో జనరల్ బాడీ ప్రతినిధిగా సురేష్‌రెడ్డి



భారతదేశంలోనే సహకార రంగంలో అతి పెద్ద ఎరువుల కర్మాగారమైన ఇఫ్కో జనరల్ బాడీ ప్రతినిధిగా నెల్లూరుకు చెందిన తలమంచి సురేష్ కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. మార్చి 27వతేదీ నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఇఫ్కో 14వ జనరల్ బాడీ ప్రతినిధి ఎన్నిక జరిగింది. నెల్లూరుజిల్లాతో పాటు రాయలసీమలోని నాలుగు జిల్లాలు చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురంల నుండి 218 మంది ఇఫ్‌కో సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనరల్‌బాడీ ప్రతినిధికి జరిగిన ఎన్నికలో సభ్యులు తలమంచి సురేష్‌కుమార్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కాగా, తదుపరి ఆయన ఇఫ్కో డైరెక్టర్‌గా కూడా ఎన్నికయ్యే అవకాశముంది. ఐదు రాష్ట్రాలకు ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. గత 20ఏళ్ళుగా సురేష్‌కుమార్‌రెడ్డి డైరెక్టర్ పదవి కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈసారి ఆయనకు అవకాశాలు మెండుగా వున్నట్లు తెలుస్తోంది. ఇఫ్కో సభ్యుల ప్రతినిధిగా ఈ ప్రాంతానికి రావాల్సిన ఎరువుల నిల్వల కోసం కృషి చేస్తానని రైతులకు ఎరువుల కొరత లేకుండా ఇఫ్కో యాజమాన్యంతో చర్చిస్తానని సురేష్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా ‘లాయర్’కు వెల్లడించాడు. ఇఫ్కో జనరల్‌బాడీ ప్రతినిధిగా తనను ఎన్నుకున్న సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో త్యాగరాజ స్మరణోత్సవాలు



డాక్టర్ రాధికను సన్మానిస్తున్న ఎస్.పి.శైలజ

నెల్లూరులో ప్రతి ఏడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా భిక్షాటనా పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో స్మరణోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 54వ త్యాగరాజ స్మరణోత్సవాలు ఈనెల 25 నుండి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు నెల్లూరు వేదాయపాళెం వద్ద నున్న శ్రీ త్యాగరాజ మందిరం నుండి శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్సమేత శ్రీ త్యాగరాజ ఉత్సవ విగ్రహాలను, శ్రీ త్యాగరాజస్వామి చిత్రపటాన్ని ఊరేగింపుగా టౌన్ హాలుకు తీసుకొని వచ్చి శ్రీస్వామివారిని ప్రతిష్ఠించి కలశస్థాపనతో పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. 25వతేది సోమవారం ఉదయం, మధ్యాహ్నం హరికథా కాలక్షేపం జరిగింది. సాయంత్రం చెన్నై నివాసి శృతి శంకర్‌కుమార్ అండ్ పార్టీవారిచే నిర్వహించిన గాత్ర కచేరి అందరినీ అలరించింది. 26వ తేది మంగళవారం హరికథా కాలక్షేపాలు, స్థానిక సంగీత కళాకారుల గాత్ర, వయొలిన్ కచేరీలు అనంతరం చెన్నై నివాసి అభిషేక్ రఘురాం అండ్ పార్టీ వారిచే నిర్వహించిన గాత్ర కచేరి శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది. 27వ తేది బుధవారం నిర్వహించిన హరికథా కాలక్షేపం, స్థానిక కళాకారుల గాత్ర, వీణ, కీబోర్డు కచేరీలు, డాక్టర్ దుడ్డు రాధిక అండ్ పార్టీ వారి గాత్ర కచేరి వీనులవిందుగా సాగాయి. 28వ తేది గురువారం హరికథా కాలక్షేపం, స్థానిక కళాకారుల గాత్ర, కీబోర్డు కచేరీలు, సాయంత్రం చెన్నై నివాసి వెంకట నాగరాజన్ అండ్ పార్టీ వారిచే నిర్వహించిన గాత్ర కచేరి సభికులను అలరించింది. ఈ కార్యక్రమాలను స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవి ప్రసాద్, అధ్యక్షులు చతుర్వేదుల శ్రీరామమూర్తి, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు. నగర ప్రముఖులు, సంగీతాభిమానులు, కళాకారులు, కళాపోషకులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# ఉత్తరం వైపే!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌పార్టీలు ప్రచార ఉధృతిని పెంచాయి. ఇంత జరుగుతుంది సరే... ఎన్నికల్లో గెలుపెవరిది? అన్న ప్రశ్న ప్రతి ఒక్క ఆంధ్రుడిలో అనుక్షణం మెదలుతోంది. ఫలితాల విషయంలో ఎవరి లెక్కలు వాళ్ళకు వున్నా, ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాలు ఎటు మొగ్గితే అటే అధికారం అన్నది పక్కాగా తేలుతోంది. 2014 ఎన్నికల్లో పవన్ ఫ్యాక్టర్ పని చేయబట్టి ఈ ఐదు జిల్లాల్లోనూ టిడిపి అత్యధిక స్థానాలు సాధించి అధికారాన్ని కైవసం చేసుకోగలిగింది.

కాని, 2019లో అవే పరిస్థితులు వున్నాయా? రాయలసీమలోని నాలుగు జిల్లాలు అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలులతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలను తీసుకుంటే ఈ ఆరు జిల్లాల్లో ఒక్క సీటైనా వైకాపాకే ఎక్కువ వస్తుంది. ఇందులో సందేహమే లేదు. ఈ జిల్లాల్లోనే వైసిపి మైనార్టీలో పడితే ఆ పార్టీ మొత్తం సీట్లు 50కు మించవు. గుంటూరు, కృష్ణ జిల్లాల్లో సామాజిక సమీకరణల దృష్ట్యా ఇరు పార్టీలకు మధ్య పెద్ద అంతరం వుండకపోవచ్చు. కాని చూపంతా ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల మీదే! 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు కాపు కాసిన కాపులు ఈసారి ఎవరి వైపు మొగ్గు చూపుతారన్న ఆసక్తి సర్వత్రా కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో టిడిపి గతంలోలాగా క్లీన్ స్వీప్ చేస్తేనే ఆ పార్టీ అవకాశాలు మెరుగ్గా వుంటాయి. అలాకాకుండా వైసిపి, టిడిపికి సమానంగా సీట్లు సాధించినా టిడిపి ప్రమాదంలో పడ్డట్లే! చూద్దాం ఉత్తరజిల్లాల ఓటర్లు ఏ పార్టీకి తూర్పుదిక్కు చూపించనున్నారో!



## 'ప్రభా'తం

# ఎన్నికల సంఘానికే సవాల్!

**ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రచారార్భాటాలు మిన్నంటుతున్నాయి. ఓట్ల కోసం కోట్లు ఖర్చుపెట్టడానికి కూడా నాయకులు వెనుకంజ వేయడం లేదు. ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా డబ్బు, మద్యం వగైరాలన్నీ చాపకింద నీరులా సాగిపోతూనే ఉన్నాయి. తాము గెలవడమే లక్ష్యంగా అనేకమంది నాయకులు అడ్డదారులు తొక్కుతూ, అక్రమాలకు కూడా పాల్పడుతున్నారు. ఎన్నికల సంఘానికే సవాల్‌గా మారుతున్న ఇలాంటి అక్రమాలన్నిటినీ అడ్డుకుని దేశంలో స్వేచ్ఛగా.. న్యాయంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే.**

17వ సార్వత్రిక ఎన్నికలకు తొలివిడత పోలింగ్‌కు నామినేషన్ల ఘట్టం కూడా ముగియడంతో, ఇక ఎన్నికలు సమీపిస్తున్నాయి కనుక, దేశమంతా ఎన్నికల వాతావరణం వేడెక్కిపోయింది. ఎటుచూసినా అంతా ఉత్కంఠభరిత వాతావరణం కనిపిస్తోంది.

మరోవైపు నాయకుల ఎన్నికల ప్రచారాలు మరింత జోరందుకున్నాయి. ఆయా పార్టీల నేతల ఆవేశపూరిత ప్రసంగాలతో దేశం అట్టుడికిపోతోంది. ఓట్ల కోసం నాయకులు కోటి పాట్లు పడుతున్నారు. డబ్బు, మద్యం వగైరాలన్నీ చాపకింద నీరులా సాగిపోతూనే ఉన్నాయి. ఎన్నికల నిబంధనలకు తూట్లు పొడిచి, గెలవడమే ధ్యేయంగా నాయకులు అనేక ప్రాంతాల్లో తమ దుర్నీతులను ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో, అందరి దృష్టి ఎన్నికల కమిషన్‌పైనే ఉంది. ఇలాంటి అక్రమాలను అడ్డుకుని దేశంలో స్వేచ్ఛగా..న్యాయంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే.

అయితే, దాదాపు 90 కోట్ల మంది ఓటర్లతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా అవతరించిన మన దేశంలో.. ఎన్నికల నిర్వహణ అంటే మాటలు కాదు, కత్తిమీద సాము వంటిదని అందరికీ తెలిసిందే. అయినా, ఎన్నికల సంఘం తన శక్తివంచన లేకుండా ఆయా అక్రమాలను అడ్డుకుంటూనే ఉంది. అందులోనూ ఇప్పుడు ఎన్నికలంటే సమరమే అన్నట్లుగా ఉంటున్నాయి. ఈ రణరంగంలో అందరూ నిబంధనలు తప్పనిసరిగా సక్రమంగా పాటిస్తే అంతకన్నా కావాల్సిందేముంది!.. కానీ, ఎన్నికల నియమావళిని లెక్కచేయకుండా అనేక మంది నాయకులు ఎవరి చిత్తానుసారం వారు వ్యవహరిస్తూనే ఉండడం అందరికీ తెలిసిందే. అక్రమమో..సక్రమమో ఏదైతేనేం.. ఈ ఎన్నికల్లో తాము గెలిచితీరాలని తాపత్రయపడే రాజకీయ నాయకులే ఇప్పుడు ఎక్కువగా ఉంటున్నారు. అట్లని నీతి-నిజాయితీలకు మారుపేరుగా ఉండే నాయకులు లేరని కాదు... అయితే, వీరి సంఖ్య మాత్రం చాలా తక్కువ. ఇప్పుడంతా అరాచక రాజకీయాలే వీరంగం చేస్తున్నాయి. కోటానుకోట్లు డబ్బున్న వారికే రాజకీయం చెల్లుబాటవుతున్నది కానీ, నీతి-నిజాయితీతో ఉండేవారికి సీటు కానీ, చోటు కానీ దొరకడం లేదు. ధనబలం, కండబలం ఉన్న వారికే రాజకీయాల్లో గొప్ప స్థానం లభిస్తోంది.

అందుకే, మనదేశంలో రానురాను నీతిమంతమైన రాజకీయాలకు కాలం చెల్లిపోతున్నదా.. అనిపిస్తోంది. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా రాజకీయనాయకులు ఇప్పుడు అన్ని రకాల టక్కుటమారాది విద్యలు ప్రయోగిస్తున్నారు. డబ్బుతో ఓట్లను గెలుచుకునేందుకు నానా రకాల పాట్లు పడుతున్నారు. ఏదోవిధంగా పదవి వస్తే చాలు.. అంతకు అంత సంపాదించుకోవచ్చనే ఉబలాటం ఉండే నాయకులూ లేకపోలేదు. అందుకే, ఎన్నికల కమిషన్ ఎన్నిరకాల నిబంధనలు అమలుచేస్తున్నా, ఆ నియమాలకు చాలామంది నాయకులు తిలోదకాలిచ్చేస్తున్నారు. అనేకచోట్ల మరీ బరితెగించిపోతున్నారు. అడ్డదారుల్లో ఓటర్లను ఆకట్టుకోవడానికి కుయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఎన్నికల కమిషన్ విధించిన వ్యయపరిమితి లక్షల్లో ఉంటే, ఖర్చుమాత్రం కోట్లు దాటించేస్తున్నారు. అయితే ఎన్నికల సంఘం నిబంధించినట్లుగా ఎన్నికల ఖర్చును ఆ పరిమితికి లోబడే ఖర్చుచేసేవారు ఏ కొద్దిమందో ఉంటారు. కోటానుకోట్లుగా డబ్బున్నవారు ఎన్నికల రంగంలో ఉన్నప్పుడు డబ్బును వారు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుండడం మామూలైపోయింది. మరోవైపు ఓటర్లను ఎలాగైనా సరే, గాలం వేసి లాగేందుకు చేయాల్సిన అన్ని రకాల ప్రయత్నాలన్నీ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అత్యధిక ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది.

ఎన్నికల్లో గెలవడం కోసం డబ్బును నీళ్లలా ఖర్చుచేయడం, మద్యాన్ని ఏర్లుగా పారించడం, రకరకాల తాయిలాల తాంబూలాలు పంచడం, ఓట్లు ఎలాగైనా రాబట్టడానికి బేరసారాలు చేయడం వంటివన్నీ మామూలే!.. అయితే, ఎన్నికల కమిషన్ శక్తివంచన లేకుండా అలాంటి వాటన్నిటికీ చెక్ పెడుతూనే ఉంది. డబ్బు, మద్యం నిల్వలపై దృష్టి సారించి ఎక్కడికక్కడ స్వాధీనం చేసుకుంటూనే ఉంది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటినుంచి ఇప్పటి దాకా దేశవ్యాప్తంగా దాదాపు 540 కోట్ల విలువైన నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం తాజాగా ప్రకటించింది కూడా. అంతేకాదు, ఇంత భారీఎత్తున నగదుతోపాటు, విలువైన నగలు, కోట్లాది లీటర్ల మద్యాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. దీన్నిబట్టి, ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకోవడానికి రాజకీయపార్టీలు, నాయకులు ఎంతగా తెగబడుతున్నారో... ఎంతగా 'మితి' మీరుతున్నారో కూడా తేటతెల్లమవుతుంది. అంతేకాదు, వ్యక్తిగత దూషణలకు ఎవరూ పాల్పడకూడదని ఎన్నికల నియమావళి స్పష్టం చేస్తున్నా నాయకగణం ఏమాత్రం ఆ నిబంధనను పట్టించుకోవడమే లేదు. దేశంలో తాము అగ్రనేతలమని చెప్పుకునేవారు కూడా ఒకరి మీద మరొకరు విచక్షణా రహితంగా ఆవేశపూరిత ప్రసంగాలతో రాజకీయాలను రణరంగం చేస్తుంటే, ఇక వారిని అనుసరించే చిన్నపాటి నాయకుల స్థితి.. ఆవేశపూరిత విధానాలు ఎలా ఉంటాయో ఊహించవచ్చు. కోటానుకోట్ల ప్రజలు, ఓటర్లున్న ఇంత గొప్ప ప్రజాస్వామ్య దేశంలో ప్రజలకు విశుద్ధమైన.. నిజాయితీపాలన అందించే విధంగా కృషిచేయాల్సిన నాయకులు ఇలా నిబంధనలు ఉల్లంఘిస్తూ అడ్డదారుల్లో ఓట్ల సంపాదనకు ప్రయత్నిస్తుండడమే విచారకరం!.. ఎన్నికల కమిషన్ మరింత కట్టుదిట్టంగా ఈ అరాచకాలను అడ్డుకోవాలి. ఎన్నికల సంఘానికే సవాల్‌గా మారుతున్న నాయకుల అక్రమాలకు అడ్డుకట్టవేయాలి. దేశంలో స్వేచ్ఛగా.. పటిష్టంగా ఎన్నికలు నిర్వహించాలి. అదేవిధంగా, ఓటర్లు కూడా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా విజ్ఞతతో వ్యవహరించాలి. మంచినేతలకు ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసుకోవడమేకాక, దేశసౌభాగ్యానికి కూడా ఎంతో శ్రేయోదాయకమని అందరూ గుర్తించాలి. వ్యక్తిగత స్వార్థాలను పక్కనపెట్టి తమ తమ రాష్ట్ర, భారతదేశ భవిష్యత్ కోసం ఆలోచించి ఓటు వేయాలి. ప్రజల భవితను, దేశభవితను కాపాడే ఓటుహక్కును ఓటర్లందరూ సద్వినియోగం చేసుకుని.. తద్వారా దేశంలో సుపరిపాలనకు.. సుస్థిరపాలనకు బాటలు వేయాలి. అందుకు సరైన సమయం ఇదే!..

## న్యూరాలజీ వ్యాధులపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సంపత్‌కుమార్

నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 24న ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు ఆధ్వర్యంలో న్యూరాలజీ సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ ఎన్.ఎస్.సంపత్‌కుమార్ పక్షవాతం, నడుం నొప్పి, మూర్ఛవ్యాధి నరాలు, కండరాలు సంబంధిత వ్యాధులపై సూచనలు, సలహాలు ఇచ్చారు. వెన్నునొప్పి నివారణకు తగినంత వ్యాయామం చేయాలని, పోషకాహారం తీసుకోవాలన్నారు. అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, ఉపాధ్యక్షులు జి.వి.కృష్ణయ్య, ఎన్.సాయిసుబ్బారావు, సంయుక్త కార్యదర్శి లక్కాకుల శ్రీనివాసులు, చెంచయ్యనాయుడు జాలీవాకర్ సోను, డా॥ కె.సత్యనాథ్, డాక్టర్ కె.సూర్య నారాయణ, వీరిశెట్టి హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సమయాన్ని పెంచారు

రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని ఒక గంట మేర పెంచినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈవిఎంలతో పాటు కొత్తగా వివి ప్యాట్‌లను వినియోగించనుండడం, ఓట్ల శాతం పెరగడం ఇందుకు కారణం. గతంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరిగేది. ఈసారి ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈవిఎంల విధానంలో ఓటు వేశాక ఎవరికి ఓటు వేశామో ఓటరు వివిప్యాట్ పరికరం ద్వారా చూసుకోవచ్చు. వివి ప్యాట్‌లో ఏడు సెకండ్ల పాటు ఓటు వేసిన గుర్తు ఉంటుంది. దీంతో ఓటు వేయడానికి ఎక్కువ సమయం పడుతుంది. గంట సమయం పెంచడం వల్ల ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకునేందుకు అవకాశం కలిగింది.

## మనుషుల్లాగా ప్రవర్తించండి

ఓట్ల కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఆడుతున్న విద్వేషపూరిత నాటకాలు చూస్తుంటే అసహ్యం కలుగుతుంది. ఓట్ల కోసం రెండు ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారు వీళ్ళిద్దరూ! హైదరాబాద్‌లో ఆంధ్రులపై దాడులు జరుగుతున్నాయంటూ కొందర్ని రెచ్చగొట్టాలని చూస్తున్నారు. తెలుగురాష్ట్రాలు విడిపోయాయన్నమాటే గాని హైదరాబాద్‌లో ఆంధ్రులకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. వాళ్ళ ఉద్యోగాలు, వాళ్ళ వ్యాపారాలు ఎంతో ప్రశాంతంగా చేసుకుంటున్నారు. తెలంగాణలో ఆంధ్రుల మీద ఏదన్నా దాడులు జరిగితే ముందుగా చంద్రబాబు ఆస్తుల మీద, మెగా కుటుంబం ఆస్తుల మీద జరగాలి. వాళ్ళు ఇక్కడ బ్రహ్మాండంగానే వున్నారుగా! ఈ కారుకూతలు మానుకోండి.

కాసారం నగేష్, హైదరాబాద్.




## అద్వానీపై కాకమ్మ కథలు

బీజేపీ కురువృద్ధుడు అద్వానీకి ఈసారి ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదని ప్రతిపక్షాలు, బీజేపీ వ్యతిరేక మీడియా శోకండాలు పెడుతున్నాయి. అద్వానీకి 91ఏళ్ళు. బీజేపీలో వారసత్వ రాజకీయాలు వుండవు. ఒక నిర్దిష్ట కాలందాటి పోతే అద్వానీ అయినా, మోడీ అయినా పోటీ నుండి తప్పుకోవాల్సిందే! అంపశయ్య మీద వుండి ఎన్నికలలో పోటీ చేయడానికి ఇదేం కాంగ్రెస్‌పార్టీ కాదు. నాకు టిక్కెట్ ఇవ్వలేదని అద్వానీ వచ్చి వీళ్ళ ముందేమన్నా బాధపడ్డాడా? అద్వానీ విషయంలో అతి చేయొద్దు.

సి.రాజీవి, నెల్లూరు.

## శిఖండి పాత్రలో పవన్

నేను ఒకప్పుడు పవన్‌కళ్యాణ్ అభిమానిని. రాజకీయాలలో ఆయన చపలత్వం చూసి... ఛీఛీ ఇటువంటి వాడినా నేను అభిమానించింది అని అనిపించింది. రాష్ట్రంలో జగన్‌ను అడ్డుకోవడానికి పవన్‌ను ఒక శిఖండిలా వాడుకుంటున్నాడు చంద్రబాబు. రోషం, పౌరుషం లేకుండా పవన్ ఆయనకు అమ్ముడుపోయాడు. సినిమాలలో హీరో రాజకీయాలలో జీరో అయ్యాడు.

– కె.వి.నవీన్‌రెడ్డి, నెల్లూరు.

## ధనం గెలుస్తుందా? అభిమానం నిలుస్తుందా?

నెల్లూరు నగరంలో వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్, టిడిపి అభ్యర్థి పి.నారాయణల మధ్య పోటీ జనం అభిమానానికి, కోట్ల రూపాయల ధనానికి మధ్య పోటీలా మారింది. పదేళ్ళ నుండి నగర ప్రజలకు సమస్య వచ్చిందంటే పరుగెత్తుకొచ్చిన నాయకుడు అనిల్. నారాయణ కార్పొరేట్ స్టైల్ రాజకీయ నాయకుడు. సామాన్యులు ఆయన వద్దకు పోలేరు. నారాయణ గెలిస్తే పట్టాభిరామిరెడ్డి లాంటి వారి పెత్తనం వస్తుంది. కాబట్టి ప్రజలు ఆలోచించి ఓటెయ్యాలి.

కొణకల కార్తీక్, నెల్లూరు.





# ఎన్నికల చదరంగం 3





## ఆత్మకూరు...
# ఆత్మీయుల పోరు

ఆనం వెంకటరెడ్డి, ముప్పవరపు వెంకయ్యనాయుడు లాంటి ఉద్ధండులకు రాజకీయ పాఠాలు నేర్పిన నియోజకవర్గం. కుటుంబ రాజకీయాలకంటే కూడా ప్రజాసేవలో తమ పెర్ఫార్మెన్స్ చూపించిన వాళ్ళకు పెద్దపీట వేస్తారు ఇక్కడి ప్రజలు. అందుకే నాడి పట్టిన సాధారణ వైద్యుడు డాక్టర్ బి.సుందరరామిరెడ్డిని గతంలో మూడుసార్లు గెలిపించి వున్నారు.

2019 ఎన్నికలకు సంబంధించి ఈ నియోజకవర్గం ప్రత్యేకత ఆత్మీయుల మధ్య పోటీ నెలకొనడం. తెలుగుదేశం అభ్యర్థిగా బొల్లినేని కృష్ణయ్య, వైసిపి అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి తలపడుతున్నారు. వీళ్లిద్దరి కులాలు, పార్టీలు వేరైనా నిన్నటివరకు ఒకే కుటుంబం అన్నట్లు కలిసిమెలిసి సాగినవాళ్లే! వీరికి వ్యాపార సంబంధాలతో పాటు ఆత్మీయ అనుబంధాలున్నాయి. బొల్లినేని కృష్ణయ్య ఇంట్లో ఒక బిడ్డగానే మేకపాటి గౌతమ్‌రెడ్డి పెరిగాడు. కాని, రాజకీయాలలో ఇప్పుడు ప్రత్యర్థులయ్యారు.

బొల్లినేని కృష్ణయ్య 1999లో కేవలం కొమ్మి లక్ష్మయ్యనాయుడిని ఓడించాలనే వ్యక్తిగత కసితో రాజకీయాల్లోకి వచ్చాడు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి కొమ్మిపై గెలిచాడు. 2004లో ఆత్మకూరు నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి అదే కొమ్మి చేతిలో ఓడిపోయాడు. ఆ తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా వుంటూ తన పనులు తాను చేసుకుంటున్నాడు. అయితే 2019 ఎన్నికలకు ఆత్మకూరులో తెలుగుదేశంకు బలమైన అభ్యర్థి లేకపోవడంతో ఆ పార్టీ నాయకత్వం ఆయనను పట్టుకుని తెరమీదకు తెచ్చింది. ఆత్మకూరు టిడిపి అభ్యర్థిగా నిలబెట్టింది.

ఇక వైసిపి అభ్యర్థి మేకపాటి గౌతమ్‌రెడ్డికి వరుసగా ఇది రెండో ఎలక్షన్. 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆనం రామనారాయణరెడ్డి పుణ్యాన గెలిచాడు. ఇప్పుడు కూడా అదే ఆనం రామనారాయణరెడ్డి ఇంకో విధంగా కలిసొచ్చాడు. ఆనం వైసిపిలో చేరడం గౌతంకు ఈ ఎన్నికల్లో కలిసొచ్చింది. ఆనం చేరకపోయి వుంటే గౌతంకు బాగా ఇబ్బందే! ఇక ఈమధ్య ఆత్మకూరు టిడిపి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైసిపిలో చేరడం వల్ల ఈ నియోజకవర్గంలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. గౌతమ్ మీద నియోజకవర్గంలో కొంత వ్యతిరేకత వున్నప్పటికీ ఇటీవల మారిన పరిణామాలతో ఆ వ్యతిరేకత పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు.

## సూళ్ళూరుపేట...
# ఎవరికో ఈ పీట

జిల్లాలో వున్న రెండు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలలో ఇదొకటి! ఈ నియోజకవర్గంలో పెత్తనం రెడ్లదే అయినా, వాళ్ళు ఎమ్మెల్యేలు కాలేరు. ఎమ్మెల్యే అభ్యర్థులను నిలబెట్టి గెలిపిస్తుంటారంతే!

2019 ఎన్నికలకు సంబంధించి గత అభ్యర్థులే మళ్ళీ తెరమీదకు వచ్చారు. తెలుగుదేశం అభ్యర్థిగా మాజీమంత్రి పరసా రత్నం, వైసిపి అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పోటీపడుతున్నారు. 1994 నుండి పరసా రత్నమే ఇక్కడ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. 1994, 1999, 2009 ఎన్నికల్లో గెలిచాడు. 2004, 2014 ఎన్నికల్లో ఓడిపోయాడు. ఈసారి నియోజకవర్గంలో పలువురు పార్టీ నాయకులు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ అంతకంటే మెరుగైన అభ్యర్థి లేక పరసానే దించారు.

ఇక వైసిపి అభ్యర్థి కిలివేటి సంజీవయ్య 2014లో ఉద్యోగానికి రాజీనామా చేసి వైసిపిలో చేరాడు. 2014లో సూళ్లూరుపేట నుండి వైసిపి అభ్యర్థిగా విజయం సాధించాడు. ఈ ఐదేళ్ళు ప్రజల మధ్యనే వున్నాడు. వ్యక్తిగా మంచి పేరుంది. ఇటీవల నియోజకవర్గంలో సంబంధించిన పరిణామాలన్నీ సంజీవయ్యకు కలిసొచ్చేవే! నియోజకవర్గంలో టీడీపీలో అంతర్గత కలహాలు ఆ పార్టీ కేడర్‌ను నిర్వీర్యం చేయగా, సంజీవయ్య సమర్ధ నాయకత్వం వైసిపిలో ఉత్సాహాన్ని తెచ్చింది. నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, డి.వి.సత్రం, తడ, పెళ్లకూరు, నాయుడుపేట మండలాలలోనూ ఇటీవల వైసిపిలోకి భారీగా వలసలు జరిగాయి. కొత్త నాయకులు చేరారు. టిడిపి కంటే ఇక్కడ వైసిపియే హుషారుగా వుంది.



## సర్వేపల్లి...
# ఎవరిదో మళ్ళీ!



జిల్లాలో మెట్ట, మాగాణి కలగలిసిన నియోజకవర్గం ఏదన్నా వుందంటే అది సర్వేపల్లి. సర్వేపల్లి అన్నది ఒక మండల కేంద్రం కూడా కాదు, కేవలం ఒక గ్రామం. ఆ గ్రామం పేరు మీద ఏర్పడ్డ నియోజకవర్గం అలానే వుంది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో కూడా దీని పేరు మార్చలేదు.

2009కు ముందు ఇందుకూరుపేట, ముత్తుకూరు, టిపిగూడూరు, వెంకటాచలం మండలాలలో కొంతభాగం, నెల్లూరు రూరల్ మండలంలో కొంత భాగంతో సర్వేపల్లి నియోజకవర్గముండేది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ఇందుకూరుపేట మండలం కోవూరులోకి పోగా, ముత్తుకూరు, టిపి గూడూరు వంటి డెల్టా మండలాలతో పాటు వెంకటాచలం పూర్తిగా, మనుబోలు, పొదలకూరు వంటి మెట్ట మండలాలలు కొత్తగా ఈ నియోజకవర్గంలో చేరాయి.

2019 ఎన్నికలు... పాత ప్రత్యర్థులే మళ్ళీ తలపడుతున్నారు. తెలుగుదేశం అభ్యర్థిగా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైసిపి అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి. సోమిరెడ్డి రాజకీయ మనుగడకు ఈ ఎన్నికలు విషమ పరీక్ష కానున్నాయి. సర్వేపల్లి నుండి ఆయన పోటీ చేయడం ఇది వరుసగా ఆరోసారి. 1994, 1999 ఎన్నికల్లో గెలిచిన ఆయన 2004, 2009, 2014 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఓడిపోయి ఓటమి హ్యాట్రిక్ కొట్టాడు. ఇప్పుడు కూడా ఓడిపోతే అదొక రికార్డ్ అవుతుంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే తపనతోనే ఐదేళ్ళుగా ఆయన నియోజకవర్గంలో తిరుగుతూనే వున్నాడు. 2014లో ఓడిపోయినప్పటికీ ఎమ్మెల్సీగా, ఆ తర్వాత మంత్రిగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను సాధించాడు. నిధులను బాగానే తెచ్చాడు. నియోజకవర్గంలో కాళ్ళకు బలపాలు కట్టుకున్నట్లు తిరిగాడు.

మరోపక్క వైసిపి అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి.. సోమిరెడ్డికి ఎక్కడా తగ్గలేదు. ఆయనపై బురదచల్లడంలో ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఈ బురదను కడుక్కోవడానికే సోమిరెడ్డి నానా తంటాలు పడాల్సివచ్చింది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల్లో సోమిరెడ్డి అభివృద్ధి మంత్రం పనిచేస్తుందా? లేక ప్రభుత్వ వ్యతిరేకత మళ్ళీ సోమిరెడ్డిని ముంచుతుందా? తెలియని పరిస్థితి. నియోజకవర్గంలో సమీకరణలు మారాయి. ప్రభుత్వ వ్యతిరేకత అంశంతో పాటు, ఆనం, ఆదాల వంటి వాళ్ళు వైసిపిలో చేరడంతో వారి వర్గీయులు చాలామంది వైసిపిలో చేరారు. ఈ ఎన్నికల వరకు ఆనం వర్గాన్ని కాకాణి బాగానే వాడుకున్నాడు. సోమిరెడ్డి ఈ ఐదేళ్ల కాలంలో చేసిన పనులు ఫలితాన్నిస్తాయో లేక మారిన సమీకరణాలతో సోమిరెడ్డి వరుసగా ఈ నియోజకవర్గం నుండి నాలుగోసారి, కోవూరుతో కలిపితే ఐదోసారి ఓటమి మూటగట్టుకుంటాడో చూడాలి!?

## ఎన్నికల పండక్కి...
# ముందుగానే సీట్లు రిజర్వ్

నెల్లూరుజిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది ఉద్యోగ, వ్యాపారులు, ఇతర ఉపాధి పనుల నిమిత్తం దేశంలోని వివిధ రాష్ట్రాలలో, నగరాలలో స్థిరపడి వున్నారు. సాధారణంగా సంక్రాంతి, దసరా, దీపావళి, వినాయకచవితి వంటి పండుగలప్పుడు, అలాగే తిరునాళ్లు, జాతరలకు వీళ్ళంతా ముందుగానే రైళ్ళు, బస్సులలో టిక్కెట్లు బుక్ చేసుకుని తమ గ్రామాలకు వస్తుంటారు. పండుగ కాగానే పోతుంటారు. ఈ సంవత్సరం ఓట్ల పండుగ వచ్చింది. ఏప్రిల్ 11వ తేదీ జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో తమ ఓట్లు వేసేందుకోసం వీళ్ళంతా మరోసారి తమ తమ గ్రామాలకు రాబోతున్నారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, విజయవాడ, విశాఖ ఇంకా పలు ప్రాంతాలలో నెల్లూరీయులు నివసిస్తున్నప్పటికీ ఎక్కువమంది తమ ఓట్లను సొంత ఊర్లలోనే నమోదు చేయించుకున్నారు. దీంతో ఓట్లు వేసేందుకు ఏప్రిల్ 10వ తేదీనే వీళ్ళంతా తాముంటున్న ప్రాంతాల నుండి బయలుదేరి నెల్లూరు జిల్లాకు రావడానికి సంసిద్ధమవుతున్నారు.



# రసవత్తరంగా రాజకీయ చర్చలు



దాదాపు 10రోజులుగా ఏ నలుగురు ఒక చోట కలిసినా ఒకటే టాపిక్... ట్రెండ్ ఎలావుంది, ఏ పార్టీకి ఎన్ని సీట్లొస్తాయి.. నెల్లూరుజిల్లాలో వైసిపి ఎన్ని గెలుస్తుంది... నెల్లూరు సిటీలో నారాయణ ఓడిపోతాడా? గెలుస్తాడా... ఇవే చర్చలు. జనం ఇంకే విషయాలు పట్టించుకోవడం లేదు. ఇతర అంశాల గురించి సమస్యల గురించి చర్చించడం లేదు. ఒకే ఒక్క టాపిక్ పాలిటిక్స్! ముఖ్యంగా ఉదయాన్నే వాకర్స్ అధికంగా వుండే ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం, విఆర్‌సి, ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్, సెయింట్ పీటర్ స్కూల్, చిల్డ్రన్స్ పార్క్ ఏరియాలలోనూ, అలాగే కాఫీషాపులు, హోటళ్ళు, బార్‌లలోనూ... ఇవే చర్చలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ చర్చల్లో వాదోపవాదాలు కూడా జరుగుతున్నాయి.




## పార్లమెంటు గోదాలో బీద...



జిల్లా తెలుగుదేశం పార్టీలో బలహీనవర్గాల నాయకుడిగా కంటే బలమైన నాయకుడిగా పేరున్న వ్యక్తి బీద మస్తాన్‌రావు. అటు వ్యాపార రంగంలోను, ఇటు రాజకీయ రంగంలోనూ అందరితో కలుపుగోలుగా ఉండే నాయకుడు. ఈ ఎన్నికల్లో కావలి అసెంబ్లీ నుండి తెలుగుదేశం అభ్యర్థి కావాల్సిన వాడు ఊహించని పరిణామాల మధ్య నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి అయ్యాడు. నెల్లూరు లోక్‌సభ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేయడమంటే సాహసం చేయడమే! ఆ పార్టీ పెట్టిన తర్వాత ఇంతవరకూ రెండుసార్లు మాత్రమే ఆ పార్టీ అభ్యర్థులు ఈ లోక్‌సభలో గెలవగలిగారు. మరి బిఎంఆర్ మూడోగెలుపును అందిస్తాడో లేదో చూడాలి?

## విజయ'లక్ష్మి' అయ్యేనా?



ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ ఇంట్లో మనిషి లాంటి నాయకురాలు మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి. రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో ఇక ఆ పార్టీలో భవిష్యత్ ఉండదనుకుని ఇటీవలే తెలుగుదేశంలో చేరి తిరుపతి పార్లమెంట్ నుండి ఆ పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దిగింది. ఇప్పటిదాకా కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తు మీద ఓట్లడిగిన ఆమె... తొలిసారి సైకిల్ గుర్తుతో ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్ ఉన్నప్పుడు ఎంపీ అభ్యర్థిగా సునాయాస విజయాలందుకున్న ఆమె... తెలుగుదేశం అభ్యర్థిగా మాత్రం విజయలక్ష్మి కోసం ఆపసోపాలు పడాల్సి వస్తోంది.

## 'నారాయణ' మంత్రం ఫలించేనా?



రాజకీయాలకు పూర్తిగా కొత్త.. మంత్రి పి.నారాయణ. ఆనం వివేకానందరెడ్డి లాంటి నాయకుడు రాజకీయాలు నెరిపిన నెల్లూరు నగరంలో నారాయణలాంటి కార్పొరేట్ నాయకులు రాణించడం చాలా కష్టమే! తెలుగుదేశం పార్టీని స్థాపించాక నెల్లూరు నగరంలో ఆ పార్టీ గెలిచింది రెండే రెండుసార్లు. మొదటిది ఆ పార్టీ పెట్టిన 1983 ఏడాది జరిగిన ఎన్నికల్లో... రెండో గెలుపు 1994లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకతతో. ఇప్పుడు ఈ ఎన్నికలలో గెలుపు కోసం నారాయణ పార్టీ కేడర్‌ను, రాజకీయాలను నమ్ముకోలేదు. ఈ ఐదేళ్లలో తాను వేయించిన సిమెంట్‌రోడ్లు, భూగర్భడ్రైనేజీ, పార్కులు వంటి అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని నమ్ముతున్నాడు.

## ఆశీర్వదిస్తే.. అభివృద్ధి అంటున్న అజీజ్



2014 ఎన్నికల్లో అబ్దుల్ అజీజ్ వైసిపి టిక్కెట్ కోసం ప్రయత్నించాడు. రాలేదు. మేయర్‌గా అవకాశం వచ్చింది. మేయర్ అయ్యాక చాలా తక్కువ వ్యవధిలోనే రాజకీయ పార్టీ మార్చి... పార్టీలు మార్చాలంటే పొలిటికల్ సీనియార్టీ అవసరం లేదని చాటిచెప్పాడు. 2019 ఎన్నికల్లో కూడా ఆయన తెలుగుదేశం సీటును ఆశించాడు. నెల్లూరు రూరల్ టిడిపి అభ్యర్థిగా ప్రచారం కూడా చేసుకుంటుండిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైసిపిలోకి పోవడంతో నెల్లూరురూరల్ టిడిపి టిక్కెట్ అబ్దుల్ అజీజ్ ఇంటి తలుపు తట్టింది. తలవని తలపుగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడు. మరి నెల్లూరురూరర్‌లో అజీజ్ తొలి ముస్లిం ఎమ్మెల్యే అవుతాడా?

## సెన్సేషన్ స్టార్ పోలంరెడ్డి...



నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రలో పెను సంచలనం లాంటి నాయకుడెవరంటే.. అది పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి. పార్టీ ఏది అన్నది చూడడు. ఏ పార్టీ టిక్కెట్ ఇచ్చినా... తాను గెలవాలన్నదే చూసుకుంటాడు. వ్యాపార రంగం నుండి రాజకీయాల్లోకి వచ్చినా... ఎన్నికల్లో రాణించడంలో మంచి అనుభవాన్ని సాధించాడు. 2004 ఎన్నికల్లో కుప్పం తర్వాత తెలుగుదేశం గెలవబోయే రెండో సీటు అనుకున్న కోవూరు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా సంచలన విజయం సాధించాడు. మరిప్పుడు ప్రసన్న మీద ఐదో పోరాటానికి సిద్ధమయ్యాడు. ఈ పోరాటంలో ఇంకో సెన్సేషన్ హిట్ సాధిస్తాడా? లేక చతికిలబడతాడా?

## పరసా... వరస మారేనా?



ఈసారి వద్దంటున్నా కూడా సూళ్లూరుపేట తెలుగుదేశం టిక్కెట్‌ను మాజీమంత్రి పరసా రత్నంకే ఇచ్చారు. ఒకప్పుడు నియోజకవర్గంలో ఆయనకు మంచి పేరే ఉండేది. ఇప్పుడా పేరు పాడుపడిపోయింది. టిక్కెట్ ఇవ్వకముందే పరసా అయితే ఈసారి సూళ్లూరుపేట నుండి గెలవడనే పేరు తెచ్చేసుకున్నాడు. నియోజకవర్గంలో నెలకొన్న వర్గ విభేదాలు కూడా పరసా విజయావకాశాలకు గండి కొడుతున్నాయి. గత ఐదేళ్ళలో జరిగిన పరిణామాలు ఇక్కడ పార్టీని నిర్వీర్యం చేశాయి. పరసా కూడా అంత ఉత్సాహంగా పని చేసిన దాఖలాలు లేవు. కాబట్టి ఇక్కడ గెలవడం అన్నది కొండకు వెంట్రుక వేయడమే అవుతుంది!

## రామకృష్ణ హ్యాట్రిక్ వీరుడయ్యేనా?



ఒకే అసెంబ్లీ నుండి వరుసగా మూడుసార్లు గెలవడమన్నది అందరికీ సాధ్యమయ్యే పని కాదు. ప్రభుత్వ వ్యతిరేకతలను, ప్రభంజనాలను తట్టుకోగలిగిన నాయకుడికే అలాంటి హ్యాట్రిక్‌లు సాధ్యమవుతుంటాయి. ఇప్పుడు అలాంటి హ్యాట్రిక్ ఛాన్స్ వెంకటగిరి సిటింగ్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముందుంది. ఈ నియోజకవర్గంలో నల్లపరెడ్లకు, నేదురుమల్లి కుటుంబాలకు కూడా హ్యాట్రిక్ గెలుపు సాధ్యం కాలేదు. పరిస్థితులు అనుకూలించి కురుగొండ్ల రామకృష్ణ ఈ నియోజకవర్గం నుండి 2009, 2014 ఎన్నికల్లో విజయం సాధించాడు. ఇప్పుడు గెలిస్తే హ్యాట్రిక్ కొట్టినట్లే! నియోజకవర్గంలో ఇప్పుడున్న వాతావరణంలో ఆయన హ్యాట్రిక్ టార్గెట్ నెరవేరుతుందా?

## గెలుపు వాసన కోసం సోమిరెడ్డి



1999 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సి.వి.శేషారెడ్డిపై తెలుగుదేశం అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఘనవిజయం... సరిగ్గా 20ఏళ్ళ క్రితం వార్త ఇది. మళ్ళీ అటువంటి వార్త కోసం ఆయన అనుచరులు, అభిమానులు ఎదురు చూస్తూనే వున్నారు. 2012లో జరిగిన కోవూరు ఉపఎన్నికలతో కలుపుకుంటే ఇప్పటి వరకు నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో అపజయాలు... ఈ ఎన్నికల్లో కూడా ఓడితే జిల్లా రాజకీయ చరిత్రలో అదో రికార్డు... గెలిస్తే మళ్ళీ సెకండ్ ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టినట్లే! సోమిరెడ్డి పోరాటయోధుడు. కళ్ళ ముందు ఓటమి ఉన్నా కూడా గెలుపు కోసం అలుపెరుగని యుద్ధం చేసే సైనికుడు.

## గోడ దూకుడే యమ'పాశం' అయ్యిందా?



2014 ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ నుండి వైసిపి ఎమ్మెల్యేగా గెలిచిన పాశం సునీల్‌కుమార్ కొద్ది కాలానికే తెలుగుదేశంలోకి జంప్ చేశాడు. దీంతో నియోజకవర్గంలో ఆయన రాజకీయ విలువలు లేని నాయకుడిగా ముద్రపడ్డాడు. వ్యతిరేకత కూడా బాగా వచ్చింది. వైసిపిలోనే వుండుంటే ఈ ఎన్నికల్లో ఆయన పరిస్థితి బాగానే వుండేది. కాని, తెలుగుదేశంలోకి పోవడం వల్ల ఆ చెడ్డపేరే ఆయన రాజకీయ భవిష్యత్‌కు యమపాశంలా మారింది. నియోజకవర్గంలో పాశం సునీల్‌కు గట్టి మద్దతుదారులు కూడా మిగల్లేదు. పెద్ద రాజకీయ కుటుంబాలన్నీ వైసిపిలోకి వెళ్లిపోవడంతో పాశం ఇక్కడ గడ్డు సమస్యనే ఎదుర్కోనున్నాడు.

## 'విష్ణు' చక్రం తిప్పేనా?



శాసనసభ ఎన్నికల్లో తాను తెలుగుదేశం అభ్యర్థిని అవుతానని కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కలలో కూడా వూహించుకుని వుండడు. రాజకీయాలలో 'అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని' అనే దానికి విష్ణుయే ఉదాహరణ. ప్రస్తుతం కావలి తెలుగుదేశం అభ్యర్థి. వైసిపి సిటింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి సీటు రాకూడదని చెప్పి గట్టిగా పోరాడాడు. ఆయనకు వచ్చింది. విష్ణుకు వచ్చింది. కాకపోతే విష్ణుకు తెలుగుదేశం వాళ్ళు వెదికి మరీ ఇచ్చారు. ఇంతకాలం ఆయనకు వ్యతిరేకంగా వున్న బీద సోదరులే ఇప్పుడు ఆయన గెలుపు కోసం పనిచేస్తున్నారు. మరి కావలిలో విష్ణు చక్రం ఎంతవరకు తిరుగుతుందో?

## 'కృష్ణయ్య' దూకాడు రంగానికి...




ఒక క్రికెటర్‌కి ఒక సంవత్సరం గ్యాప్ వచ్చాక... మళ్ళీ మ్యాచ్‌లోకి దిగితే కొత్తగానే ఉంటుంది. ఫామ్‌లోకి రావడానికి తిరిగి కొంత సమయం పడుతుంది. రాజకీయ నాయకులు కూడా అంతే! పదేళ్ళుగా రాజకీయాలకు విఆర్‌ఎస్ ఇచ్చి తను మానాన తాను ఉన్న బొల్లినేని కృష్ణయ్యకు ఈ ఎన్నికల్లో ఆత్మకూరు తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా రాక తప్పలేదు. నియోజకవర్గంలో నెలకొన్న గొడవలే ఆయన అభ్యర్థిత్వానికి బాటలు వేశాయి. ఒప్పుకున్నాక తప్పదుగదా! రంగంలోకి దిగాక గెలుపు కోసం గట్టిగానే పోరాడుతున్నాడు. ఒకప్పుడు కొమ్మి లక్ష్మయ్యనే ఢీ కొన్న నాయకుడికి మేకపాటి గౌతమ్ పెద్ద లెక్క కాదు.!

## వద్దన్నవాడే దిక్కయ్యాడు!



ఉదయగిరి నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకు తీవ్ర వ్యతిరేకత ఉండింది. నియోజకవర్గంలోని పార్టీ నాయకులే ఆయనకు మళ్ళీ సీటు ఇవ్వొద్దంటూ సీఎం చంద్రబాబునే కోరారు. ఒక దశలో చంద్రబాబు కూడా ఆయనను పక్కనపెట్టాలని ఆలోచించాడు. అయితే... ఉదయగిరి టిక్కెట్ కోసం పోటీపడ్డ వాళ్ళలో బొల్లినేని రామారావే కొంచెం బెటర్‌గా కనిపించడంతో... చంద్రబాబే ఆయనకు టిక్కెట్ ఖరారు చేశాడు. ఉదయగిరి నుండి వెంకయ్యనాయుడు, కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు వరుసగా రెండుసార్లు గెలిచిన చరిత్ర ఉంది. మరి రామారావు కూడా ఈ ఖాతాలో చేరతాడా?

# ఓటిచ్చి చోటిస్తారా?




# ఓడిచ్చి షాకిస్తారా?

## ప్రభంజన 'ప్రభాకరు'డు...




2019 ఎన్నికల సంచలనం ఏదన్నా ఉందంటే... అది ఆదాల ప్రభాకర్‌రెడ్డే! తెలుగుదేశంలో ఉన్న ఆయన వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరడంతోనే రాష్ట్ర రాజకీయాలు షేకయ్యాయి. నెల్లూరుజిల్లా రాజకీయాలలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపోటములే తారుమారయ్యాయి. ఒక నాయకుడు పార్టీ మారితే... ఎంత ప్రభావం ఉంటుందో తెలియదుగానీ... ప్రభాకర్‌రెడ్డి అనే నాయకుడు మాత్రం పార్టీ మారితే... ఎంత ప్రభావం ఉంటుందన్నది ఈ ఎన్నికల్లో చవిచూశాం. నెల్లూరు లోక్‌సభ వైసిపి ఎంపి అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి రంగంలో ఉండడంతో ఆ ఊపు జిల్లా అంతా కనిపిస్తోంది.

## ఈ 'బల్లి' శుభశకునం పలికేనా?



తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాదరావు ఈ ఎన్నికల్లో గెలిచాడంటే... అంతకంటే అదృష్టవంతుడు లేడనుకోవాలి. తెలుగుదేశం వాళ్ళు గూడూరు అసెంబ్లీ టిక్కెట్టే లేదు పొమ్మంటే... వైసిపి వాళ్ళు ఏకంగా పిలిచి తిరుపతి పార్లమెంటు టిక్కెట్‌నే ఇచ్చారు. అది కూడా ఈ పార్లమెంట్‌లో పార్టీ చాలా పటిష్టంగా ఉంది. ఈ టికెట్ ఇస్తే పార్టీలో చేరేందుకు చాలామంది సిద్ధంగా వున్నారు. అయినా కూడా అవకాశం బల్లి దుర్గాప్రసాద్ తలుపు తట్టింది. మరి బల్లి తన గెలుపుతో పార్టీకి శుభశకునం పలుకుతాడో లేదో చూద్దాం!

## అందరివాడు అనిల్..



"ఫోన్ చేసి సమస్య వుందంటే అనిల్ మన ఇంటి ముందుంటాడు... అదే నారాయణను పట్టుకోవాలంటే నాలుగు గేట్లు దాటాలి.." ప్రస్తుతం నెల్లూరు నగరంలో నడుస్తున్న టాక్. నెల్లూరురూరల్ వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.అనిల్‌కుమార్‌యాదవ్‌కు నగరంలో మంచి పేరుంది. కులమతాలకు అతీతంగా అందరూ అనిల్‌ను అభిమానిస్తున్నారు. ఈ ఐదేళ్లలో జగన్‌కు అత్యంత విశ్వాసం చూపించిన వారిలో అనిల్ ఒకడు. కాబట్టే జగన్ అభిమానులు సైతం అనిల్‌ను ఇంకా అభిమానిస్తున్నారు. పదేళ్ళుగా అతను నగర ప్రజలమధ్యే వుంటున్నాడు. మరి అందరివాడిగా ముద్రపడ్డ అనిల్‌ను అందరి అభిమానమే ఈ ఎన్నికలలో గట్టెక్కిస్తుందా? అన్నది చూడాలి!

## 'మను' మనసులు దోచేనా?



నెల్లూరురూరల్ జనసేన అభ్యర్థి మనుక్రాంత్ చెన్నారెడ్డి... ఎన్‌ఆర్‌ఐ కుర్రాడు. పవన్‌కళ్యాణ్ అంటే అభిమానం. సొంత జిల్లా నెల్లూరు అంటే పిచ్చి. జనసేన మార్గాన్ని తన రాజకీయ ఎజెండాగా ఎంచుకొన్నాడు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే నెల్లూరు జిల్లాలో జనసేన పార్టీ తరపున ప్రచారం మొదలుపెట్టిన తొలి అభ్యర్థి మనుక్రాంత్. రాజకీయాలలో ఏదో సాధించాలని, ప్రజలకు ఏదో చేయాలనే తపనవున్న నాయకుడు. జనసేన జెండాతో గ్లాసు గుర్తుతో ప్రజల్లోకి వెళ్ళాడు. మరి నెల్లూరు రూరల్ జనం మనసుల్లో ఈ జనసేన మను ఏ మాత్రం స్థానం సంపాదించుకుంటాడో చూద్దాం!

## ప్రజలను 'ప్రసన్న'ం చేసుకుంటాడా?



మాజీమంత్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తన పెద్ద కొడుకు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కుటుంబ వారసత్వంగా ఏ మాత్రం ఆస్థి ఇచ్చాడో తెలియదుగాని, రాజకీయ వారసత్వంగా కోవూరు నియోజకవర్గ ప్రజలను మాత్రం ఇచ్చాడు. నల్లపరెడ్డిది పేరుకు సొంతూరు కోట అయినా, కోవూరే మా వూరు అన్నంతగా ఇక్కడి ప్రజలతో మమేకమయ్యారు. ప్రసన్న ఇంతవరకు కోవూరు నుండి ఐదుసార్లు తెలుగుదేశం అభ్యర్థిగా, రెండుసార్లు వైసిపి అభ్యర్థిగా పోటీ చేశాడు. ఐదుసార్లు గెలిచాడు. రెండుసార్లు ఓడిపోయాడు. ఆయన ఎప్పుడూ కోవూరు జనాల మధ్యే వుంటున్నాడు. ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో వున్నాడు.

## సంజీవనిలాంటోడు సంజీవయ్య...



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టి ఎనిమిదేళ్ళ అయ్యింది. కాని, ఈ పార్టీలో వున్న సామాన్య ఎమ్మెల్యేలు నూటపాతికేళ్ళ చరిత్రలు కలిగిన జాతీయ పార్టీలలో కూడా వుండరు. వైసిపి ఎమ్మెల్యేలు చాలామంది సాదాసీదాగా సామాన్య జనంలో కలిసిపోతూ వుంటారు. అలాంటి వారిలో మొదటి ర్యాంకరే కిలివేటి సంజీవయ్య. ఎమ్మెల్యే అనే దర్పం లేదు... హంగూ ఆర్భాటం వుండదు. వయసులో చిన్నోడైనా పెద్దోడైనా ఆత్మీయపూర్వక పలుకరింపే ఆయనకు ఆభరణం. స్నేహ సంబంధాలే ఆయన రాజకీయ భవిష్యత్‌కు సంజీవనిలా మారాయి. ఈసారి వైసిపి అధికారంలోకి వస్తే సూళ్లూరుపేటను పారిశ్రామికాభివృద్ధికి కోటగా మలుస్తానంటున్నాడు.

## 'రామ' బాణం గిరిని కొట్టేనా?



జిల్లాలోనే సీనియర్ పొలిటీషియన్ ఆనం రామనారాయణరెడ్డి 38ఏళ్ళ రాజకీయ చరిత్రలో అత్యంత దురదృష్టకరమైన సంవత్సరం ఏదన్నా వుందంటే అది 2014. 1983 నుండి ఆయన మొత్తం నెల్లూరు, రాపూరు, ఆత్మకూరుల నుండి 8సార్లు అసెంబ్లీకి పోటీ చేస్తే, ఆయనకు కనీసం డిపాజిట్ కూడా దక్కని ఎన్నికల సంవత్సరం 2014. ప్రతి ఎన్నికల్లోనూ గెలిచినా, ఓడినా మొనగాడిలా పోరాడాడు. 2014 ఎన్నికల్లో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించాడు. ఈ ఎన్నికల్లో వెంకటగిరికి గురిపెట్టాడు. రామబాణం కరెక్ట్‌గా తగిలితే ఈసారి వెంకటగిరి కోట ఆయనదే! ఎందుకంటే వెంకటగిరి రాజాలు ఆల్‌రెడీ ఆయన వాళ్ళయ్యారు.

## కాకాణికి కాలం కలిసొచ్చేనా?



సర్వేపల్లి వైసిపి అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కాలం కలిసొస్తున్నట్లు ఉంది. కాలం కలిసొచ్చే ఆయన జడ్పీఛైర్మెన్ అయ్యాడు. ఆ కాలం అనుకూలంగా వుండబట్టే 2014లో సోమిరెడ్డి చాలా ఆలస్యంగా సర్వేపల్లి బరిలోకి దిగడం వల్ల 30వేలతో గెలుస్తాడనుకున్న కాకాణి ముక్కి మూలిగి 5వేలతో గెలిచాడు. ఇప్పుడూ కాలం కలిసొచ్చినట్లుంది. ఓ పక్క మంత్రిగా సోమిరెడ్డి నానా తంటాలు పడి నియోజకవర్గంలో నాలుగు పనులు చేసి ఓట్ల కోసం పాట్లు పడుతున్నాడు. కాకాణి ఏమో మొన్నటిదాకా తాను విభేదించిన రామనారాయణరెడ్డి వైసిపిలోకి రాగానే, సర్వేపల్లిలో వున్న ఆయన అనుచరవర్గాన్నంతా లాగేసుకుని సింపుల్‌గా స్ట్రాంగ్ అయ్యాడు.

## గూడూరుకు వరప్రసాదమేనా?



ఐదేళ్ళు తిరుపతి ఎంపీగా పనిచేసి ఈ ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ వైసిపి అభ్యర్థిగా పని చేస్తున్నాడు వెలగపూడి వరప్రసాద్. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. సబ్జెక్ట్ వున్న మనిషి. తిరుపతి ఎంపీగా వుండడం వల్ల గూడూరుపై బాగా అవగాహన వున్నోడు. గెలిస్తే గూడూరుకు వరాలు కురిపిస్తానంటున్నాడు. ఈ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానంటున్నాడు. వరప్రసాద్‌కు తగ్గట్లే కాలం కూడా కలిసొస్తుంది. సిటింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్‌పై వ్యతిరేకత ఆయనకు వరం కావచ్చు. ఇక టిడిపి నుండి వచ్చిన వలసలు పెద్ద కుటుంబాల చేరిక వరప్రసాద్‌కు వరమాల కానున్నాయి.

## 'ప్రతాప'ం చూపిస్తాడా?



కావలి సిటింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రొఫెషనల్ రాజకీయవేత్త కాదు. రియల్ ఎస్టేట్ వ్యాపారి. కొమ్ములు తిరిగిన కలికి యానాదిరెడ్డి లాంటి యోధునికే కావలి రాజకీయాలు ఓ పట్టాన అర్థం కావు. ప్రతాప్ పంతంబట్టి సీటు తెచ్చుకున్నాడు. విష్ణు, వంటేరులు కలిసికట్టుగా అతనిని వ్యతిరేకించారు. సీటిస్తే ఓడిపోతాడని ఘంటా పథంగా చెప్పారు. అల్లూరులో బీద, విష్ణులు కలిసి గట్టిగా పోరాడుతున్నారు. ఆ మండలంలో ప్రతాప్ కాలు పెట్టే పరిస్థితి కూడా లేదు. మరి ఇలాంటి సమయంలో గెలిస్తేనే కదా ప్రతాప్... తన ప్రతాపమేంటో చూపించేది!

## గాలే గట్టెక్కిస్తుంది...



జిల్లాలో గాలివాటం రాజకీయాలను నమ్ముకున్న కుటుంబం మేకపాటిది. 2004, 2009లలో వై.యస్.రాజశేఖరరెడ్డి గాలిలో, 2012 ఉపఎన్నికలు, 2014లలో జగన్ గాలిలో మేకపాటి కుటుంబం గెలిచింది. గత ఎన్నికల్లో ఆత్మకూరు అసెంబ్లీ నుండి వైసిపి అభ్యర్థిగా మేకపాటి గౌతమ్‌రెడ్డి గెలిచినా, నెల్లూరు పార్లమెంటు నుండి మేకపాటి రాజమోహన్‌రెడ్డి గెలిచినా... అది జగన్ ప్రభంజనం మరియు ఆత్మకూరు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆనం రామనారాయణరెడ్డి పుణ్యమేననుకోవాలి. మరోసారి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. ఈసారి కూడా జగన్ గాలినే గట్టిగా నమ్ముకుని ఉన్నాడు.

## గెలుపు.. వెతుక్కుంటూ రావాలి



జిల్లా రాజకీయాల్లోనే ఉదయగిరి అసెంబ్లీ నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేస్తున్న మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిది విభిన్న శైలి. గెలుపైనా, ఓటమైనా తనను వెతుక్కుంటూ రావాలన్నట్లు ఆయన స్టైల్ ఉంటుంది. అనుచర నాయకులను బుజ్జగించడం, బ్రతిమాలడం, ఓట్లు అడగడం... ఆయన పద్ధతి కాదు. జనం వై.యస్.ను, జగన్‌ను చూసి ఓట్లు వేస్తారనే నమ్మకం ఆయనది. మరోసారి ఆ బలమైన నమ్మకంతోనే బరిలో దిగాడు. ఉదయగిరి నుండి ఇప్పటికి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, అక్కడనుండి ఎక్కువసార్లు గెలిచిన నాయకుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఈ ఎన్నికల్లో కూడా గెలిస్తే.. ఈ రికార్డును కొట్టేవాళ్ళు దరిదాపుల్లో ఉండరేమో?!

# గూడూరు డివిజన్ వార్తలు

### ఆనం సమక్షంలో
## వైకాపాలో చేరిన కాంగ్రెస్ నాయకులు



రామనారాయణరెడ్డి, వరప్రసాద్‌లను సత్కరిస్తున్న వైకాపా నాయకులు

చంద్రబాబు హామీలను ప్రజలు ఇంకా నమ్మే స్థితిలో లేరని మాజీమంత్రి, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తెలిపాడు. గూడూరు మండలం చెన్నూరు కటాలమ్మ దేవస్థాన ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఏఎంసి మాజీఛైర్మెన్ మోపాటి రామరాఘవరెడ్డి అలియాస్ బాబురెడ్డి, గూడూరు పట్టణ కాంగ్రెస్ మాజీఅధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, నాయకులు దశరథరామరాజు, చెన్నూరు మాజీసర్పంచ్ శివకుమార్, 24సొసైటీ డైరెక్టర్ ఇందుకూరు జనార్ధన్‌రెడ్డితో పాటు వారి అనుచరులు ఆనం రామనారాయణరెడ్డి, గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరప్రసాద్ సమక్షంలో వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆనం మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వరప్రసాద్‌రావు, దుర్గాప్రసాద్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి, నాయకులు కనుమూరు హరిచంద్రారెడ్డి, మద్దల నరేంద్రరెడ్డి, రాజారెడ్డి, సునీల్‌రెడ్డి, శీనయ్య, చంద్రమోహన్, కిషోర్, కొండారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఇటీవల వైసిపి నాయకులు వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి, నందవరం సుబ్బారావు, కట్టా రామచంద్రరావుల సమక్షంలో సుమారు వందమంది చిల్లకూరు మండలంలోని వల్లిపేడు గ్రామస్తులు వైయస్సార్సీపీలో చేరిన సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడుతున్న వైకాపా నాయకులు కొడవలూరు ధనుంజయరెడ్డి.



గూడూరు తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేస్తున్న పాశం సునీల్‌కుమార్ విజయాన్ని ఆకాంక్షిస్తూ ఈనెల 25వ గూడూరులోని 18వ వార్డులో ప్రచారం చేస్తున్న ఆయన సతీమణి శ్రీమతి సంధ్యారాణి, కౌన్సిలర్ శ్రీమతి పిళ్ళెల్ల శ్రీదేవి, జిల్లా టిడిపి కార్యదర్శి సిరి శ్రీనివాసచౌదరి తదితరులు.

## విజయానికి కృషి చేయండి




వైకాపాలో చేరిన ఏఎంసి మాజీ ఛైర్మెన్ కోడూరు శ్రీనివాసులురెడ్డి

గూడూరు పట్టణానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు, పురపాలకసంఘం మాజీ వైస్ ఛైర్మెన్ కోడూరు శ్రీనివాసులురెడ్డి ఇటీవల వైఎస్సార్సీపిలో చేరారు. గూడూరు మాలవ్యానగర్‌లోని ఆయన నివాసంలో జరిగిన ఓ కార్యక్రమంలో వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి వి.వరప్రసాద్, వైకాపా నాయకులు హరిచంద్రారెడ్డి, పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పొణకా శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన వైకాపాలో చేరారు. ఆయనతో పాటు రెడ్డి సంక్షేమసంఘం ప్రధాన నాయకులు కలికి జనార్ధన్ రెడ్డి మరికొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు, దివిపాళెంకు చెందిన ప్రజాప్రతినిధులు ఆ పార్టీలో కోడూరు శ్రీనివాసులురెడ్డితో పాటు చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ విజయానికి అందరూ కృషిచేయాలన్నారు. దివిపాళెం పంచాయతీ 20 ఏళ్ళుగా కోడూరు శ్రీనివాసులురెడ్డి పట్టులో ఉంది. ఆయన తరపున సర్పంచ్ పదవిలో ఉన్నారు. అర్బన్‌బ్యాంక్ అధ్యక్షులుగా ఆయన పనిచేశారు. ఆయన వైకాపాలో చేరడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో వైకాపా నాయకులు కోడూరు మీరారెడ్డి, నాసిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, మగ్దూమ్, గిరిబాబు పాల్గొన్నారు.



కోడూరు కల్పలత, మీరారెడ్డిలను సత్కరిస్తున్న వైకాపా నాయకులు



### వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా
## కోడూరు కల్పలత

గూడూరు పురపాలక సంఘ మాజీ అధ్యక్షురాలు కోడూరు కల్పలతను వైకాపా అధిష్టానం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంతో నాయకులు, కార్యకర్తలు కోడూరు దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా కల్పలత, వైకాపా నాయకులు కోడూరు మీరారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైకాపా విజయమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఈ పదవి రావడానికి కారణమైన జగన్మోహన్‌రెడ్డికి, మేకపాటి రాజమోహన్‌రెడ్డికి మీరారెడ్డి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. సుభాన్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి న్యూస్

## ఊపందుకున్న ప్రచారం

చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తిలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ రసవత్తరంగా ఉంది. ఇక్కడ బిజెపి తరపున కోలా ఆనందకుమార్, తెలుగుదేశం పార్టీ నుంచి బొజ్జల సుధీర్‌రెడ్డి, వైఎస్సార్సీపి నుంచి బియ్యపు మధుసూదన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఈ ముగ్గురూ యువతరానికి ప్రతినిధులు కావడం విశేషం. అలాగే కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ బత్తెయ్యనాయుడు బరిలో నిలిచారు. కోలా ఆనందకుమార్ గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో పలు పదవుల్లో పనిచేశారు. వైఎస్ శిష్యులుగా ఉంటూ మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడుకు సన్నిహితంగా ఉండేవారు. అనంతరం జరిగిన రాజకీయపరిణామాల్లో కోలా బిజెపిలో చేరారు. శ్రీకాళహస్తి బిజెపి అభ్యర్థిగా పోటీలో ఉన్న కోలా ఆనందకుమార్‌కు ఆయన కుటుంబసభ్యులు కూడా ప్రచారరంగంలోకి దిగి ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా బొజ్జల సుధీర్‌రెడ్డి తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తెలుగుదేశం నాయకునిగా శ్రీకాళహస్తిలో పట్టు సాధించారు. 5సార్లు ఎమ్మెల్యేగా ఇక్కడ గెలిచి, మంత్రి పదవులు కూడా చేపట్టారు. రాజకీయాల్లో ఆరితేరిన కుటుంబంగా బొజ్జల కుటుంబం ప్రసిద్ధి. నారా లోకేష్, సుధీర్‌రెడ్డిల మధ్య మంచి సాహచర్యం కూడా ఉంది. శ్రీకాళహస్తి తెలుగుదేశం అభ్యర్థిగా రంగంలోకి దిగిన సుధీర్‌రెడ్డిని గెలిపించాలంటూ వారి కుటుంబసభ్యులు కూడా ప్రచారంలో ఉన్నారు. ఇకపోతే, వైఎస్సార్సీపి అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి తొలినుంచి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అభిమాని. సుమారు 17 ఏళ్లుగా శ్రీకాళహస్తీశ్వరాలయం ఉభయదారుడుగా ఉంటూ నిరుపేదలకు బంగారు తాళిబొట్లు పంపిణీచేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఆయన అందరికీ చిరపరిచితులే. వైఎస్సార్సీపి అభ్యర్థిగా తనను గెలిపించాలంటూ మధుసూదన్‌రెడ్డి తన ప్రచారాన్ని ఉధృతం చేశారు.



ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తూ సాగుతున్న వైకాపా అభ్యర్థి బియ్యపు మధుసూధన్‌రెడ్డి



నామినేషన్ దాఖలు చేస్తున్న తెదేపా అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి



ప్రచారంలో దూసుకుపోతున్న బీజేపీ అభ్యర్థి కోలా ఆనంద్



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ బత్తెయ్యనాయుడు

# లోకేష్‌ను సత్కరించిన కేంద్ర ఎన్నికల సంఘం

గల్పిక

ప్రపంచంలోని పాతిక మేటి నగరాలను మిక్సీలో వేసి గ్రైండ్ చేసి తీస్తే వచ్చినట్లుండే అమరావతి నగరమది. ఉండవల్లిలో హైటెక్‌రత్న, సీఎం చంద్రబాబు నివాసం. అక్కడ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, కళా వెంకట్రావ్‌లు కూడా వున్నారు. అప్పుడే ప్యాకేజీ స్టార్ పవన్‌కళ్యాణ్ కూడా అక్కడకు వచ్చాడు. చంద్రబాబును కలిశాడు. చంద్రబాబు వుండి... ఏంటి పవన్, మీ విషయంలో ఆశించినంత రెస్పాన్స్ రావడం లేదు.... మీరు మాట్లాడిన ప్యాకేజీకి, ప్రజల్లో మీకున్న ఇమేజ్‌కు పొంతన కుదరడం లేదు... ఏదో ఒకటి చేసి మీ ఇమేజ్ పెంచుకోవాలి. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను వైసిపికి పోకుండా మీకు పడేటట్లు చేసుకోవాలి అని అన్నాడు. దానికి పవన్... ఏం చేసేది సార్, నేను చేయాల్సిందంతా చేస్తున్నా, చివరకు హైదరాబాద్‌లో ఆంధ్రుల మీద దాడులు చేస్తున్నారంటూ భావోద్వేగాలను రెచ్చగొట్టాలని చూసా, కాని ప్రజలు రెచ్చిపోవడం లేదు, చివరకు సిగ్గు విడిచి వైసిపికి ఓటేస్తే కేసీఆర్‌కు వేసినట్టేనని కూడా ప్రచారం చేస్తున్నా, అయినా జనాలకు తలకెక్కడం లేదంటూ వాపోయాడు. అప్పుడు చంద్రబాబు... ఇక లాభం లేదు డైరెక్ట్‌గా మనం రంగంలోకి దిగాల్సిందే పద అంటూ లేచాడు.

★★★★★


హైదరాబాద్‌లోని ప్రగతిభవన్... లోపల కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవిత, జగదీష్‌రెడ్డి తదితరులు పార్లమెంట్ ఎన్నికల ప్రచారం గురించి మాట్లాడుతున్నారు. అంతలో బయట నుండి పెద్దగా అరుపులు... రేయ్ కేసీఆర్ దమ్ముంటే రారా... వచ్చి మమ్మల్ని కొట్టరా... రేయ్ కేటీఆర్... నువ్వు మగాడివే అయితే నా ఒంటి మీద చేయి వేయ్‌రా... నా సత్తా చూపిస్తా... మీకు సిగ్గు శరం వుంటే మమ్మల్ని కొట్టండిరా... అని పెద్దగా అరుపులు.. అవి విని అందరూ ఆదుర్దాగా బయటకొచ్చారు. అక్కడ చూస్తే రోడ్డు మీద చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు నిలబడి వున్నారు. పసుపు ఛానెల్స్ కెమెరాలు వున్నాయి. కేసీఆర్ వుండి... ఏంది చంద్రబాబు నీ లొల్లి... ఎన్నికల ప్రచారంలో మేం గిట్లా పరేషాన్ అవుతున్నాం... ఈ టెన్షన్‌లో పడి నేను రాత్రి రౌండ్లు కూడా వేయలేదు. పొద్దునే ఈ సోదిపురాణమేంటని అడిగాడు. అందుకు చంద్రబాబు... మీరు నాకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తామన్నారు కదా, ఇప్పుడు ఇవ్వండి... మీకు దమ్ముంటే మమ్మల్నిద్దరినీ కొట్టండి... తన్నండి... మీకు తెలంగాణ పౌరుషమే వుంటే, మీ ఒంట్లో వుండేది తెలంగాణ రక్తమే అయితే మమ్మల్ని కొట్టండి... అని సవాల్ విసిరాడు. కేసీఆర్ అందుకు... నేను తాగాల్సిన మందు నువ్వేమన్నా తాగావురాబై... మిమ్మల్నేంది మేం కొట్టడమేంది.... తలకు తిక్కగాని పట్టిందా అని అడిగాడు. దానికి చంద్రబాబు... మీకు మమ్మల్ని అనేంత ధైర్యం లేదు... మీ బ్రతుకులకు మళ్ళీ తెలంగాణ కావాల్నా... మీరు మొగోళ్ళయితే మమ్మల్ని కొట్టండి అని మళ్ళీ సవాల్ విసిరాడు... ఆ మాటలతో కేసీఆర్‌కు తిక్కరేగింది. వీళ్ళను ఈడ్చి పక్కనపడేయండ్రా అని పోలీసులకు చెప్పబోయాడు... అప్పుడు కేటీఆర్ వచ్చి... నాన్న వాళ్ళు కావాలనే మనల్ని రెచ్చగొడుతున్నారు, ఈ టీవీ గొట్టాలను కూడా అందుకే తెచ్చుకున్నారు. వీళ్ళు మనల్ని రెచ్చగొట్టి కొట్టించుకోవాలని చూస్తున్నారు. అలా కొడితే వాళ్ళ ఛానెల్స్‌లో ప్రసారం చేసుకుని రెండు ప్రాంతాల ప్రజల మధ్య విద్వేషాలు రేపి ఏపి ఎన్నికల్లో లబ్ధి పొందాలనుకుంటున్నారు. ఇలాంటి ప్లాన్‌లకు మనం అవకాశమివ్వకూడదు అని చెప్పాడు. అది విని కేసీఆర్... వీళ్ళ బ్రతుకులు చెడ... చేసిన పనులు చెప్పుకుని ఓట్లడగాలిగాని, ఇలా కూడా చేస్తారా అంటూ లోపలకెళ్ళిపోయాడు. కేటీఆర్ మాత్రం చంద్రబాబు, పవన్‌లకు ఎండలో ఎందుకన్నా నీడలో కూర్చోండంటూ షామియానాలు వేయించి, అక్కడే కూలర్లు పెట్టించాడు. అక్కడ కూడా తమ ప్లాన్ పని చేయకపోవడంతో చంద్రబాబు, పవన్‌లు దిగాలుగా ఏడ్చారు. అంతలో చంద్రబాబు సెల్‌ఫోన్ మోగింది. అవతల నుండి భువనేశ్వరీదేవి... అర్జంట్‌గా అమరావతికి రండి... గుడ్ న్యూస్ అంటూ పెట్టేసింది. చంద్రబాబు ఏదో మన గెలుపుకు అనుకూలమైన వార్తే అయ్యుంటుందనుకుని చంకలు ఎగరేసుకుంటూ అక్కడ నుండి లేచాడు.

★★★★★

వెలగపూడి సచివాలయంలోని సమావేశ మందిరం. కేంద్ర ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గోపాలకృష్ణ ద్వివేది, మరి కొందరు మేధావులు వేదికపై వున్నారు. ఆ హాల్‌లో చంద్రబాబు కుటుంబసభ్యులతో పాటు పవన్‌కళ్యాణ్, కె.ఏ.పాల్, వివిధ పార్టీల నాయకులు వున్నారు. సునీల్ అరోరా ఆనాటి సమావేశాన్ని మొదలుపెట్టి మాట్లాడుతూ.. ఎన్నికలన్నాక అన్ని పార్టీల నాయకులు ప్రతిరోజూ తీవ్రమైన ఒత్తిడిలో వుంటారు. ఇలాంటి టెన్షన్‌లను అధిగమించేందుకు, ఎన్నికల వాతావరణాన్ని కూల్‌గా, కామెడీగా మార్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఒక రియాల్టీ షోను నిర్వహించాం. ఈ రియాల్టీ షోలో దేశ వ్యాప్తంగా ఎందరో నాయకులు పాల్గొన్నారు. కాని, అన్ని రాష్ట్రాల కంటే కూడా ఏపికి చెందిన ఇద్దరు నాయకులు ఈ కాంటెస్ట్‌లో మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఒకరు నారా లోకేష్ కాగా, రెండోవారు కె.ఏ.పాల్. మొన్నటివరకు వీరిద్దరూ సమఉజ్జీలుగా వున్నప్పటికీ గత నాలుగు రోజుల్లో చోటు చేసుకున్న పరిణామాలతో కె.ఏ.పాల్‌ను అధిగమించి లోకేష్ దూసుకుపోయాడు. ఆయన ఈ పోటీలో ప్రథమ స్థానంలో నిలవడానికి కారణమైన క్లిప్పింగ్స్ మీరే చూడండి అంటూ అక్కడే ఒక స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్రొజెక్టర్ ఆన్ చేశారు. స్క్రీన్‌పై సీన్‌లు... మంగళగిరి ప్రచారంలో లోకేష్ ప్రసంగిస్తూ...

- ఏప్రిల్ 9వ తేదీన జరిగే ఎన్నికల్లో మీరంతా నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలి.
- మంగళగిరి నుండి 5లక్షల మెజార్టీతో గెలుస్తా...
- మన మచిలీపట్నం పోర్ట్‌ను కేసీఆర్ తెలంగాణకు తరలించుకుపోవాలని చూస్తున్నారు.

ఈ మూడు సీన్‌లను చూసాక ఆ సమావేశంలో వున్నోళ్ళంతా చప్పట్లతో మార్మోగించారు. మళ్ళీ సునీల్‌అరోరా మాట్లాడుతూ... టెన్షన్ ఎన్నికల వాతావరణంలో కూడా లోకేష్ చక్కని కామెడీతో అందరి మానసిక వికాసానికి కృషి చేశారు. అందుకే 2019 ఎలక్షన్ కామెడీ స్టార్ అవార్డ్‌ను లోకేష్‌కు ఇస్తున్నామని ప్రకటించాడు. అంతేకాదు, లోకేష్‌ను వేదికపైకి ఆహ్వానించి అవార్డుతో సత్కరించారు.

# తమ్ముడు టీడీపీ... అన్న వైసిపి!



కోటంరెడ్డి విజయకుమార్‌రెడ్డిని వైసిపిలోకి ఆహ్వానిస్తున్న విపిఆర్

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశంలో వున్నాడు. నెల్లూరు నగర తెలుగుదేశం అభ్యర్థి నారాయణ గెలుపు కోసం బాగానే కష్టపడుతున్నాడు. తెలుగుదేశంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఇక ఆయన అన్న అయిన కోటంరెడ్డి విజయ కుమార్‌రెడ్డి ఇటీవలే రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సారధ్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. ఈ అన్నదమ్ము లిద్దరూ ఒకప్పుడు స్వర్గీయ మాజీముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రియశిష్యులు. ఎక్కువ కాలం కాంగ్రెస్‌లో కలిసి నడిచారు. తర్వాత ఈ అన్నదమ్ముల రాజకీయదారులు వేర్వేరయ్యాయి.



మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి, మంత్రి నారా లోకేష్‌తో కలిసి అక్కడ ప్రచారంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ కర్నాటక సమన్వయకర్త, నెల్లూరీయుడు రావి మోహన్‌చౌదరి

# 'ఖాకీ' వనంలో... పసుపు మొక్కలు

ప్రభుత్వ వ్యవస్థలను తన రాజకీయ అవసరాలకు వాడుకోవడంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు మాస్టర్ డిగ్రీలు చేసున్నాడు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో వివిధ వ్యవస్థల సేవలను రాజకీయ ప్రయోజనాల కోసం భలే వాడుకుంటుంటాడు. ఇందులో పోలీసు శాఖ పాత్ర ఎక్కువుగా వుంటుంది.

2019 ఎన్నికల్లోనూ ఆయన పోలీసు సేవలతో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలనుకుంటున్నాడు. అందుకోసమే డిజిపిని మొదలుకుని కీలకమైన విభాగాలలో తనకు అనుకూలంగా వ్యవహరించే అధికారులను నియమించుకున్నాడు. వీళ్ళు గత కొంతకాలంగా చంద్రబాబుకు తమ సేవలు అందిస్తున్నారు.

సీనియార్టీ జాబితాలో వున్న గౌతమ్ సవాంగ్‌ను కాకుండా తనను డిజిపిని చేసినందుకు ఆర్పీ ఠాకూర్ పలు సందర్భాలలో చంద్రబాబు పట్ల తన భక్తిభావం చాటుకున్నాడు. విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రతిపక్ష నేత జగన్‌పై హత్యాయత్నం జరిగిన గంటలోనే ఆయన ప్రెస్‌మీట్ పెట్టి... హత్యాయత్నం పబ్లిసిటి స్టంట్ అని చెప్పడంతోనే... ఎన్నికల్లో ఆయన సేవలు ఏ విధంగా వుండబోతున్నాయన్నది అర్థమైపోయింది. ఇటీవల అమరావతిలో నిర్వహించిన ఐపిఎస్ అధికారుల సమావేశంలోనూ ఆయన వచ్చే ఎన్నికల్లో మనమంతా సీఎం కళ్ళల్లో ఆనందం కోసం పని చేయాలన్నట్లు చెప్పారని సమాచారం. ఇక ఇంటలిజెన్స్ డిజి ఏబి వెంకటేశ్వరరావు ఖాకీ చొక్కా బదులు పసుపు చొక్క వేసుకోనిదే తక్కువ. ఆయనపై మొదటి నుండి తెలుగుదేశం బ్రాండ్ వుంది. అలాగే కొన్ని జిల్లాల ఎస్పీలపై కూడా తెలుగుదేశం అనుకూలురనే ఆరోపణలున్నాయి.

డిజిపిగా ఠాకూర్, ఇంటలిజెన్స్ డిజిగా వెంకటేశ్వరరావు, మరికొందరు ఐపిఎస్ అధికారులు విధుల్లో వుంటే ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరగవని వైసిపి వాళ్ళు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం, దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం ఇంటలిజన్స్ డిజిని, శ్రీకాకుళం, కడప జిల్లాల ఎస్పీలను బదిలీ చేయాలని ఆదేశించడం జరిగింది. వైసిపి వాళ్ళు డిజిపిని మారిస్తే గాని రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగే పరిస్థితి లేదని పట్టుబడుతున్నారు.

ఇంకోపక్క ఎన్నికల సంఘం చర్యలు చంద్రబాబుకు మింగుడుపడడం లేదు. నా రాష్ట్రంలోకి సిబిఐకి ప్రవేశం లేదని జి.ఓ జారీ చేసినట్లే, నా నియంత సామ్రాజ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు కూడా చెల్లవని జి.ఓ ఇచ్చాడు. మొన్ననే జమ్మూకాశ్మీర్ మాజీసీఎం ఫరూక్ అబ్దుల్లా వచ్చి ఒక రోజంతా పక్కనే వున్నాడుగా... ఆయన పోకడలు చంద్రబాబుకు అంటుకున్నట్లున్నాయి. ఫరూక్ కాశ్మీర్ స్వతంత్ర రాజ్యం అన్నట్లుగా, కేంద్ర ప్రభుత్వంతో మాకు పనిలేదన్నట్లుగా మాట్లాడుతుంటాడు. చంద్రబాబుకు ఆ అలవాట్లు వచ్చినట్లున్నాయి. వీరి బదిలీకి వ్యతిరేకంగా చంద్రబాబు ప్రభుత్వం తరపున హైకోర్టులో పిటిషన్ వేయించాడు. ఇంటలిజెన్స్ డిజి ఎన్నికల పరిధిలోని వ్యక్తి కాదంటూ చంద్రబాబు వితండవాదం చేస్తున్నాడు. 2009 ఎన్నికలప్పుడు ఇదే చంద్రబాబు అప్పటి డిజిపి ఎస్.ఎస్.పి.యాదవ్‌ను మార్చేంతవరకు ఒప్పుకోలేదు. అప్పుడేమో ఎన్నికల కమిషన్ మంచిగా కనిపించింది, ఇప్పుడేమో హద్దులుదాటుతున్నట్లు కనిపిస్తోంది! ఏదైనా రెండు నాలుకలు, రెండు కళ్ళు, రెండు దారులు... చంద్రబాబు సిద్ధాంతాల్లాగా మారిపోయాయి.!

# ఈ రణం.. జీవన్మరణం

ఫైనల్ మ్యాచ్... గెలిచిన జట్టు కప్పు తీసుకుంటుంది. ఓడిన జట్టు బాధతో ఇంటికిపోతుంది. అయితే అటల్లో ఈ టోర్నీ కాకపోతే తదుపరి టోర్నీలో అయినా ఆడి గెలుద్దామనే ఆశ ఒకటి ఉంటుంది. ఇలాంటి ఆశలు రాజకీయాలలో ఎన్నికలనబడే ఛాంపియన్‌షిప్ టోర్నీలో కూడా వుంటాయి. ఎన్నికలన్నాక పలు పార్టీలు పోటీ చేస్తాయి. అధికారం కోసం రెండు ప్రధానపార్టీలు తలపడతాయి. ఒక పార్టీ గెలుస్తుంది... ఒక పార్టీ ఓడుతుంది. ఓడిన పార్టీ వాళ్ళు మళ్ళీ ఐదేళ్ళ తర్వాత వచ్చే ఎన్నికల్లో పోరాడాలని డిసైడ్ అయిపోతారు. ఇదంతా కూడా దేశ రాజకీయాలలో కొనసాగుతూ వచ్చిన సరళి!

అయితే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో మాత్రం అలాంటి పరిస్థితి లేదు. ఈ రాష్ట్రంలో రేపు జరుగబోతున్న ఎన్నికలు రెండు పార్టీల మనుగడకు కాదు ఇద్దరు నాయకుల రాజకీయ భవిష్యత్‌కు జీవన్మరణ సమస్యగా మారాయి. రాష్ట్ర చరిత్రలోనే ఇంతవరకు ఇలాంటి పోటీ ఎప్పుడూ రాలేదు. ఇక్కడ రెండు పార్టీల మధ్య కాదు, ఇద్దరు నాయకుల మధ్య యుద్ధం జరుగుతున్నట్లుగా వుంది. ఈ యుద్ధంలో గెలిచినవాళ్ళు రాష్ట్ర రాజకీయ తెరపై నిలదొక్కుకుంటారు. ఓడినవాళ్ళకు ఇక రాజకీయాలలో నిలబడే సీన్ వుండదు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అయితే ఓడిపోతుందో, ఆ పార్టీ స్థానంలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్ లేదా బీజేపీలలో ఒకటి ప్రత్యామ్నాయంగా దూసుకొచ్చే అవకాశముంది.

అటు ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు... ఇటు ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి ఈ ఎన్నికలు ఫైనల్స్ లాంటివే! చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో గెలుపు అత్యంత అవసరం. ఎందుకంటే ఈ ఎన్నికల్లో ఆయన గెలవాలనుకుంటున్నది తన కోసం కాదు... తన కొడుకు లోకేష్‌ను తన రాజకీయ వారసుడిగా నిలబెట్టడం కోసం. చంద్రబాబు ఒంటి మీదకు ఏడు పదుల వయస్సు వచ్చింది. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటుంటాడు కాబట్టి గట్టిగా వున్నాడు. ఇప్పుడు గనుక మళ్ళీ గెలిస్తే తెలుగుదేశం పార్టీని లోకేష్ చేతుల్లో పెట్టొచ్చు. తాను ఆరోగ్యంగా ఉన్నప్పుడే లోకేష్‌ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలి. ఐదేళ్లలో లోకేష్‌ను సెట్ చేయాలి. పార్టీపై అతని పట్టుండేలా చేయాలి. ఏ మాత్రం లోకేష్ వీక్ అయినా పార్టీ మళ్ళీ నందమూరి వారి చేతుల్లోకి పోతుందనే భయం వుంది. ఈ ఎన్నికల్లో ఓడిపోతే తాను మాజీ అవుతాడు... చంద్రబాబుకు అది సమస్య కాదు. కాని, లోకేష్ భవిష్యత్ ఏమిటి? జగన్ స్పీడ్‌కు అతను తట్టుకోలేడు. తెలుగుదేశం నాయకులూ రివర్స్ అవుతారు. జూనియర్ ఎన్టీఆర్ పక్కలో బల్లెం అవుతాడు. జూనియర్ ఎన్టీఆర్ పార్టీ బాధ్యతలు తీసుకోవాలని ఆ పార్టీ నాయకులే డిమాండ్ చేయవచ్చు. ఈ పరిణామాలన్నీ తలెత్తకుండా వుండాలంటే ఈ ఎన్నికల్లో గెలిచి తీరాలి.

ఆ గెలుపు కోసమే చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేస్తున్నాడు. రాష్ట్రంలో వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నాడు. పోలీసులను గబ్బు కొట్టిస్తున్నాడు. సిబిఐను లెక్క చేయడం లేదు. ఎన్నికల సంఘాన్ని ఖాతరు చేయడం లేదు. నిబంధనలను తుంగలో తొక్కి, ప్రజాస్వామ్య విలువలను కాలరాసయినా గెలిచి తీరాలనే పట్టుదలతో వున్నాడు. గెలవడం కోసమే ఎన్నికలకు ముందర తాత్కాలిక తాయిలాలకు తెరలేపాడు. పవన్ కళ్యాణ్, కె.ఎ.పాల్ లాంటి వారిని ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడానికి వాడుకుంటున్నాడు. ప్రజాశాంతి పార్టీ తరపున దాదాపు 35 నియోజకవర్గాలలో వైకాపా అభ్యర్థుల పేర్లను పోలిన అభ్యర్థులనే చంద్రబాబు నిలబెట్టించాడంటే ఆయన గెలుపు కోసం ఎంతగా ఆరాటపడుతున్నాడో అర్థమవుతుంది. ఎన్నికల్లో గెలవాలని మరో ప్రమాదకరమైన క్రీడకు కూడా చంద్రబాబు తెరలేపాడు. అదే కేసీఆర్‌ను బూచిగా చూపడం. ఆంధ్రా, తెలంగాణ అంటూ ప్రజల మధ్య విద్వేషాన్ని రగిల్చే విషపు ఆలోచనలు కూడా చేస్తున్నాడు. జగన్‌కు కేసీఆర్‌కు మధ్య పొత్తు అంటగట్టి జగన్ గెలిస్తే ఆంధ్రాపై కేసీఆర్ పెత్తనం సాగిస్తాడనే పెదథోరణి ప్రచారం చేస్తున్నాడు. ఈ ఐదేళ్ల తన పాలనను చూసి ప్రజలు ఓట్లేయరనే భయానికి గురయ్యాడేమో... జాతీయ స్థాయి నాయకులైన ఫరూక్ అబ్దుల్లా, అరవింద్ కేజ్రీవాల్, స్టాలిన్, మమతా బెనర్జీ వంటి వారితో కూడా రాష్ట్రంలో ప్రచారం చేయించుకుంటున్నాడు. తన నలభై ఏళ్ల రాజకీయ చరిత్రలోనే చంద్రబాబు ఇంత అధమస్థాయికి ఎప్పుడూ దిగజారలేదు. ఈ ఎన్నికల్లో ఓడిపోతే ఇక తనకు రాజకీయ వారసత్వం వుండదనే భయమే చంద్రబాబు చేత ఇన్ని పనులు, ప్రయత్నాలు చేయిస్తుంది.

వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి రాజకీయ రణక్షేత్రంలో పోరాడడమా లేక కాడె దించేసి తన పని తాను చేసుకుపోవడమా... నిర్ణయించే ఎన్నికలివి. దేశ చరిత్రలోనే ఒక ప్రాంతీయ పార్టీ నాయకుడు దాదాపు 9ఏళ్ళు అవిశ్రాంతంగా పోరాడడం అన్నది ఒక్క జగన్ విషయంలోనే జరిగి వుండొచ్చు. 9ఏళ్లుగా ప్రజలతో ఇంతగా కలిసివున్న ప్రాంతీయ పార్టీ నాయకుడు ఇంకొకరు లేరు. 2014లో ఓడిపోయినప్పుడు జగన్ స్థానంలో ఇంకొకరు వుండుంటే పార్టీ మూతేసి తన దారి తాను చూసుకునిపోయుండేవాడు. జగన్ మొండి మనిషి. వై.యస్.రాజశేఖర్‌రెడ్డి రక్తమది. పట్టుదలకు ప్రతిరూపమది. రాజకీయ పోరాటంలో మడమతిప్పలేదు. సోనియాగాంధీని మొదలుకొని ఏబిఎన్ రాధాకృష్ణ దాకా ఈ 9ఏళ్లు అందరితో యుద్ధమే చేశాడు. ఇన్నేళ్ళు ఆయన ఓపికగా భరించింది ఈ ఎన్నికలలో గెలుపు కోసమే! పార్టీని గెలిపించడం కోసం ఒక పార్టీ అధినేతగా ఎంత చేయాలో అంతకంటే ఎక్కువే చేశాడు జగన్. 2014 ఎన్నికలనాటి లోపాలను చాలావరకు సరిదిద్దుకున్నాడు. పార్టీ టిక్కెట్లలో అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిచ్చాడు. తన సొంత విధానాలను సైతం పక్కనపెట్టి పార్టీలోకి వస్తామన్న బలమైన నాయకులను పార్టీలోకి తీసుకున్నాడు. ఈ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా జగన్ చేయని ప్రయత్నమంటూ లేదు. ఎందుకంటే ఈ ఎన్నికల్లో ఓడిపోవడం అంటూ జరిగితే జగన్‌కు పార్టీని నిలబెట్టుకోవడం ఇక కష్టం కావచ్చు. జగన్‌కు వయసుంది. పోరాడే శక్తి వుంది. కాని అధికారం లేకుంటే కేడర్ నిలవదు. లీడర్ నిలవడు. పార్టీ నిలవదు.

కాబట్టి చంద్రబాబుకైనా జగన్‌కైనా ఈ ఎన్నికలు జీవన్మరణ పోరాటమే! మరి ఏపి ప్రజలు ఎవరికి పట్టం కడతారో, ఎవరి రాజకీయ జీవితానికి చరమగీతం పలుకుతారో చూడాలి!

## కాలధర్మం దగుమాటి లక్ష్మీరెడ్డి



జలదంకి మాజీ మండలాధ్యక్షులు, గురు రాఘవేంద్ర మిక్సింగ్ ప్లాంట్స్ అధినేత దగుమాటి కృష్ణారెడ్డి(కావ్య కృష్ణారెడ్డి) తండ్రి దగుమాటి లక్ష్మీరెడ్డి మార్చి 26వ తేదీ తెల్లారుజామున అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 84 సంవత్సరాలు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. జలదంకి మండలం బ్రాహ్మణక్రాక అగ్రహారం ఆయన స్వగ్రామం. రైతు కుటుంబానికి చెందిన లక్ష్మీరెడ్డికి గ్రామంలో ఎంతో మంచిపేరుంది. రెక్కల కష్టంతో తన బిడ్డల ఉన్నతి కోసం కృషి చేశాడు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ... వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



# వైసిపిలో మెట్టుకూరు

నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలుగుదేశంకు రాజీనామా చేసి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరడం జరిగింది. ఇటీవల హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో పార్టీ అధినేత వై.యస్.జగన్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ధనుంజయరెడ్డి ఈ ఎన్నికల్లో ఆత్మకూరు లేదా ఉదయగిరి అసెంబ్లీ నుండి టిడిపి టిక్కెట్ ఆశించాడు. తెలుగుదేశం అధిష్టానం ఆయన పేరును పరిశీలిస్తున్నామని చెప్పి చివరకు మొండి చేయి చూపింది. దీంతో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నాడు. అనంతసాగరం మండలం లింగంగుంట గ్రామానికి చెందిన ధనుంజయరెడ్డి ఆనం రామనారాయణరెడ్డికి ముఖ్య అనుచరుడు. 2013లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టడం ద్వారా ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టాడు. 2014 ఎన్నికల్లో ఆత్మకూరు నుండి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆనం రామనారాయణరెడ్డి ప్రచారానికి రాకున్నా, ఆయనే ఇన్‌ఛార్జ్‌గా ఆ బాధ్యతలు నిర్వర్తించాడు. 2014లో కాంగ్రెస్‌ను వీడి తెలుగుదేశంలో చేరిన ధనుంజయరెడ్డి, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బ్యాంకు పురోభివృద్ధికి పాటుపడుతూ వచ్చాడు. 2019 ఎన్నికల్లో ఆత్మకూరు లేదా ఉదయగిరిలో ఎక్కడ సీటొచ్చినా పోటీ చేయాలని భావించాడు. అక్కడ సీటు రాకపోగా, ఒకనాటి తన సన్నిహితులంతా వైసిపిలో వుండడం, వారు ఆహ్వానించడంతో ఆ పార్టీలో చేరాడు. ఆత్మకూరు వైసిపి అభ్యర్థి మేకపాటి గౌతమ్‌రెడ్డికి ధనుంజయరెడ్డి రాకతో ఇంకొంత బలం చేకూరినట్లే!

# పగలగొట్టడం అప్పుడే మొదలుపెట్టారు

నెల్లూరు నగరంలో సిమెంట్ రోడ్లు వేసినందుకు సంతోషపడాలో, లేక ఇళ్ళకు కనెక్షన్‌ల పేరుతో అప్పుడే మళ్ళీ పగులగొడుతున్నందుకు బాధపడాలో అర్థం కావడం లేదు. నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల పరిధిలో భారీ ఎత్తున సిమెంట్‌రోడ్లు నిర్మాణం చేపట్టారు. ఎండ్ టూ ఎండ్ పేరుతో ప్రతి వీధిలో వర్షాలప్పుడు నీళ్ళు ఇంకే పరిస్థితి కూడా లేకుండా పూర్తిగా సిమెంట్‌రోడ్లు వేశారు. అయితే భూగర్భ డ్రైనేజీ స్కీంలో భాగంగా ప్రతి ఇంటి ఫ్లాట్‌కు డ్రైనేజీకి లింక్ ఇవ్వాలి. కనెక్షన్ ఇచ్చాక ఆ వీధుల్లో సిమెంట్ రోడ్లు పూర్తి చేసుండాలి. అయితే భూగర్భ డ్రైనేజీ పనులు చేసి ఇళ్ళకు కనెక్షన్‌లు ఇవ్వకముందే ఎలక్షన్‌లు వస్తున్నాయని చెప్పి రోడ్లేసేశారు. ఇప్పుడు ఇళ్ళకు కనెక్షన్‌లు ఇవ్వాలని చెప్పి వేసిన రోడ్లను పగుల గొడుతున్నారు. ఈ రోడ్ల పరిస్థితి చూస్తుంటే త్వరలో వందలకోట్లు నిధులు బూడిదలో పోసిన పన్నీరవుతాయేమోననిపిస్తోంది.

# పడకేసిన పారిశుద్ధ్యం

నెల్లూరులో పారిశుద్ధ్యం పడకేసింది. ఎన్నికల నోటిఫికేషన్ దాకా నగరంలో క్లీనింగ్ మిషన్‌లు హల్‌చల్ చేస్తుండేవి. పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగానే పని చేస్తుండే వాళ్ళు. ఎన్నికల హడావిడి ఎప్పుడైతే మొదలైందో అప్పుడే పారిశుద్ధ్య పనులు పక్కన పడిపోయాయి. మున్సిపల్ మంత్రి, నెల్లూరు మేయర్ అభ్యర్థులుగా ప్రచారంలో వుంటున్నారు. కార్పొరేషన్ కమిషనర్ ఎన్నికల విధుల్లో బిజీగా వున్నాడు. పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణ కొరవడింది. వీధుల్లో, రోడ్ల మీద ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయివుంది.

# 2 నుండి కనుపూరు ముత్యాలమ్మ జాతర



నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతర ఏప్రిల్ 2 నుండి 5వ తేదీ వరకు వైభవంగా జరిగేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఈనెల 23 న గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సబ్ కలెక్టర్ ఆనంద్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి మాట్లాడుతూ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని, జాతర సమయంలో మద్యం విక్రయాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఆనంద్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చప్పగా...

# చంద్రబాబు సభలు

- గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరిలలో బాబు ప్రచారం
- ఆకట్టుకోని పాత ప్రసంగాలు.. డీలాపడ్డ నేతలు



గూడూరు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు

ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలోని వెంకటగిరి, సూళ్ళూరుపేట, గూడూరులలో ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. ఈ మూడు అసెంబ్లీలు కూడా తిరుపతి పార్లమెంట్ పరిధిలోకి వస్తాయి. ఈ సభలలో తిరుపతి ఎంపి అభ్యర్థి పనబాక లక్ష్మిని, అలాగే అసెంబ్లీ అభ్యర్థులు కురుగొండ్ల రామకృష్ణ, పరసా రత్నం, పాశం సునీల్‌కుమార్‌లను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సభల్లో చంద్రబాబు తన సహజ వైఖరిలో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడారు. హైదరాబాద్‌లో ఆంధ్రులు అవమానాలు, బెదిరింపులతో నలిగిపోతున్నారని చెప్పారు. అదేదో గల్ఫ్ దేశాలలో భారతీయులు కష్టాలు పడుతున్నట్లుగా సీన్‌ను క్రియేట్ చేయాలనుకున్నారు. కేసీఆర్‌కు మనకు మధ్యే యుద్ధం అంటూ సీన్‌లో లేని కేసీఆర్‌ను తెరమీదకు తేవాలని చూశారు. జగన్ అధికారంలోకి వస్తే కేసీఆర్ రిమోట్ పాలన నడుస్తుందంటూ ఊదరగొట్టారు. జగన్‌ను అడ్డం పెట్టుకుని కేసీఆర్ ఆంధ్రాపై పెత్తనం చెలాయించాలని చూస్తున్నాడంటూ నూరిపోసే ప్రయత్నం చేశాడాయన. తెలుగు దేశాన్ని గెలిపిస్తే సూళ్లూరుపేటను చైనాలా చేస్తానని, వెంకటగిరిలో 'భెల్' సెజ్‌ను నెలకొల్పుతానని గాలి మేడలు కట్టారు. ఇక చంద్రబాబు ఈ సభలలో మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వెంకటగిరి రాజాలను కూడా తిట్టారు. వారందరికీ ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ మూడుచోట్ల కూడా చంద్రబాబు సభలను జనంతో నింపేసరికి నాయకులకు తల ప్రాణం తోకకు వచ్చింది.

# 'కిషోర్స్‌రత్నం' కిడ్స్ గ్రాడ్యుయేషన్ వేడుకలు



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న 'రత్నం' చిన్నారులు

నెల్లూరులోని వేదాయపాళెంలో వున్న డా. కిషోర్స్ రత్నం మోడల్ స్కూల్‌లో యుకేజి చిన్నారులకు ఇటీవల ఎంతో ఉత్సాహంగా...ఉత్తేజంగా గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో పాల్గొని విజేతలైన ప్లేక్లాస్, ఎల్‌కెజి, యుకేజి విద్యార్థు లకు బహుమతి ప్రదానం చేశారు. స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, పాఠశాల డైరెక్టర్ డా. కృష్ణకిషోర్, శ్రీమతి వాసంతి కిషోర్ పాల్గొని చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మణిమాల, రాధాకృష్ణ, మేనేజర్లు రఘురాం, విజయ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.




# వెంకయ్య ప్రచారం లేని తొలి ఎన్నికలు



1978 నుండి 2019... దాదాపు నలభై ఏళ్ళు... ప్రస్తుత భారత ఉపరాష్ట్రపతి, మొన్నటి బీజేపీ జాతీయ నాయకుడు యం.వెంకయ్యానాయుడు ప్రమేయం లేకుండా, బీజేపీ తరపున ఆయన ప్రచారం లేకుండా ఈ నలభై ఏళ్ళ కాలంలో జరుగుతున్న తొలి ఎన్నికలివి. జాతీయ రాజకీయాలలోనే కాదు, బీజేపీకి కూడా ఇదో పెద్ద లోటు. ఎన్నికలు వచ్చాయంటే వెంకయ్యానాయుడు కంచు కంఠం గణగణ మోగుతుండేది. అతను విమానాలెక్కిపోవడం కాదు, ఆయనే రెక్కలు కట్టుకున్న విమానంలాగా తిరుగుతుండేవాడు. పొద్దున కాశ్మీర్‌లో వుంటే, మధ్యాహ్నం మధ్యప్రదేశ్‌లో, సాయంత్రం సిక్కింలో, రాత్రికి రాజస్థాన్‌లో... ఇలా ఒకే రోజులో దేశంలోని నలువైపుల ప్రాంతాలలో వుండేవాడు. నాలుగుచోట్ల ప్రెస్‌మీట్‌లు పెట్టి ఆ ప్రాంతాలకు సంబంధించిన సమస్యలనే ప్రస్తావించేవాడు. వాయిస్ ఆఫ్ ది బీజేపీగా మారి పార్టీ వాణిని దేశం నలుమూలలా ప్రతిధ్వనింపజేస్తుండేవాడు. ఏ రాష్ట్రంలో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలి, ఏ సీటు ఎవరికి ఇవ్వాలనే దానిపై లోతుగా అధ్యయనం చేసేవాడు. ఢిల్లీలో వున్నా అన్ని రాష్ట్రాలలో గల్లీ స్థాయి రాజకీయాలను నిశితంగా పరిశీలించేవాడు. 1978 నుండి 2019 వరకు చూస్తే నేటి ఎన్నికలను కలుపుకుని 1978, 1985, 1989, 1991, 1996, 1998, 1999, 2004, 2009, 2014 పదిసార్లు భారత పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఈ అన్ని ఎన్నికలలోనూ వెంకయ్య చురుకైన పాత్ర పోషించారు. అలాంటి వెంకయ్య తన రాజకీయ చరిత్రలో తొలిసారిగా ఈ ఎన్నికలకు దూరంగా వుంటున్నారు. ఉపరాష్ట్రపతి అనే రాజ్యాంగ హోదా ఆయన మనసుకు కళ్లెం వేస్తుంది. ఇప్పటివరకు బీజేపీ నేతగా ఆ పార్టీ గెలుపోటములలో ప్రత్యక్ష భాగస్వామి అయిన వెంకయ్య, ఈ ఎన్నికలకు మాత్రం ప్రేక్షకపాత్రధారి అయ్యాడు.

# వైసిపిలోకి ఆర్.యస్.ఆర్

- సొంతగూటికి చేరిన వనంతోపు శీనయ్య







ఆర్ఎస్ఆర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి, హాజరైన ఆర్‌యస్ఆర్ అనుచరులు

గత రెండు దశాబ్దాల కాలంగా నగర రాజకీయాలలో చురుగ్గా పాల్గొంటూ కాంగ్రెస్ వాదిగా ఆ తరువాత వై.యస్.రాజశేఖర్‌రెడ్డికి వీరాభిమానిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ముఖ్యఅనుచరుడిగా తన కార్యకలాపాలను కొనసాగిస్తున్న రావు శ్రీనివాసరావు (ఆర్.యస్.ఆర్) మార్చి 25వ తేదీ సోమవారం వైసిపిలో చేరాడు. వందలాది మంది అభిమానుల సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నాడు. డా॥ రాజశేఖరరెడ్డి గారి మీద వున్న పిచ్చి అభిమానం, భక్తి, తనను వైసిపీవైపే లాగుతున్నప్పటికీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో వున్న వ్యక్తిగత సాన్నిహిత్య కారణంగా కొన్ని రోజులుగా పార్టీకి దూరంగా వున్నానని, ఇప్పుడు తన రాజకీయ గురువు ఆదాల వైసిపికి రావడంతో తనకు కూడా కొండంత బలమొచ్చిందని శీనయ్య చెప్పాడు. ఒక్కపైసా కూడా ఆశించకుండా తాను పిలిచీ పిలవంగానే వందల సంఖ్యలో అభిమానులు, ముఖ్యంగా ఎక్కువ స్థాయిలో మహిళలు తన కార్యక్రమానికి వచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు. వైసిపి నాయకులు, కార్యకర్తల కేరింతల నడుమ ఆయన పార్టీ కండువా కప్పుకున్నాడు. తమ నాయకుడి ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటూ సంకటస్థితిలో వున్న వందలాది మంది ఆర్.యస్.ఆర్ అనుయాయులు ఆయనతో పాటే పార్టీలోకి వచ్చేశారు. మనిషి ఎక్కడున్నా, మనసు మాత్రం రాజశేఖరరెడ్డిపైన పెట్టుకునే శీనయ్య ఎట్టకేలకు గట్టి నిర్ణయం తీసుకున్నాడు. కార్యక్రమ విజయానికి తనతో పాటు శ్రమించిన వెంకటేశ్వర్లునాయుడు, రూపేష్, వెంకటేష్, చిన్నమ్మ, మునెమ్మ, రంజిత్, శ్రీనివాసులు తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

# వైకాపాలో నారాయణ తోడల్లుడు



ఇటీవల నెల్లూరు నగర తెలుగుదేశం అభ్యర్థి మంత్రి పి.నారాయణ తోడల్లుడు రామ్మోహన్‌రెడ్డిని వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నెల్లూరు లోక్‌సభ వైసిపి అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పక్కన నెల్లూరు నగర వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్

# కల్యాణ వైభవం...!

## శ్రావణి - గౌతమ్



రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య సోదరుడు, ఓఎన్‌జిసి డిజిఎంగా పని చేస్తున్న మోపూరు మోహన్‌కుమార్ - వెంకట ప్రసన్నలక్ష్మిల కుమార్తె **లక్ష్మీ శ్రావణి - గౌతమ్‌కృష్ణ** (వెంకటగిరి వాస్తవ్యులు పోతినేని సాయిబాబునాయుడు - కృష్ణకుమారిల కుమారుడు)ల వివాహం ఈ నెల 21వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

## హిమజ - శ్రీనాథ్



ఇందుకూరుపేట మండలం, మైపాడు వాస్తవ్యులు నారపరెడ్డి మధుసూదనరెడ్డి - శ్యామలల కుమార్తె **డాక్టర్ హిమజ - డాక్టర్ శ్రీనాథ్**(హైదరాబాద్ వాస్తవ్యులు పమ్మి వీరకృష్ణారెడ్డి - స్వరాజ్యలక్ష్మిల కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 24వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com